పార్టీ ఎడ్యుకేషన్ సిరీస్

5

# పార్టీ కార్యక్రమం

ప్రచురణ : భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్రప్రదేశ్ కమిటీ

## పార్టీ ఎడ్యుకేషన్ సిరీస్ 5

# ముందుమాట

**భా**రత కమ్యూనిస్టుపార్టీ (మార్క్సిస్టు) ఎడ్యకేషన్ సబ్‌కమిటి, 2022 అక్టోబరులో 'సెంట్రల్ టీచర్ ట్రెయినింగ్ పాఠశాల'ను నిర్వహించింది. ఆ పాఠశాలలో పాల్గొన్న వారి చర్చలు, అభిప్రాయాలు ఆధారంగా అక్కడ పంపిణీచేసిన నోట్స్‌లను తాజాపరచడమైనది. అవసరమైన మార్పులు, చేర్పులతో ఈ నోట్స్‌లను ప్రచురిస్తున్నాం.

పార్టీ 'కార్యక్రమం' అంశంలో రెండు భాగాలున్నాయి. అవి : ఒకటి. పార్టీ కార్యక్రమం. రెండు. యల్‌డియఫ్ మరియు వర్తమాన రాజకీయ ఎత్తుగడల పంథా. ఆ రెంటినీ కలిపిగానీ లేదా విడివిడిగాను అన్ని స్థాయిల్లో రాజకీయ విద్యను బోధించేందుకు వినియోగించవచ్చు.

ఈ నోట్స్, అంశాన్ని బోధించే అధ్యాపకులతోపాటు, అంశాన్ని అర్థం చేసుకునేందుకు ఇతరులకు కూడా ఉపకరిస్తుందని విశ్వసిస్తున్నాము.

**పార్టీ విద్యా సబ్‌కమిటి,**

**ఫిబ్రవరి 2023** **సిపిఐ(యం) కేంద్ర కమిటి**

# పార్టీ కార్యక్రమంపై

**పా**ర్టీ కార్యక్రమం, పార్టీ నిబంధనావళి అనేవి సిపిఐ(యం)కు అత్యంత ముఖ్యమైన రెండు ప్రాథమిక డాక్యుమెంట్లు. పార్టీ నిబంధనావళి ఇలా వక్కాణిస్తున్నది: "భారతదేశంలో నివశిస్తూ, 18 ఏళ్ల వయసు దాటి, పార్టీ కార్యక్రమాన్ని నిబంధనావళిని అంగీకరించి, పార్టీ సంస్థల్లో ఏదో ఒకదానిలో పనిచేసేందుకు అంగీకరించి, పార్టీ సభ్యత్వ బకాయిలను (నిర్ణయించబడిన రుసుము, లెవీని) క్రమంగా చెల్లిస్తామని ఒప్పుకుని, పార్టీ నిర్ణయాలను అమలు జరిపేందుకు అంగీకరించిన ఏ వ్యక్తియైనా పార్టీ సభ్యత్వమునకు అర్హుడౌతాడు."

ఒకరు పార్టీ సభ్యత్వం పొందేందుకు పార్టీ కార్యక్రమం, పార్టీ నిబంధనావళిని అంగీకరించటమనేది, మొట్టమొదటి ముందస్తు షరతుగా ఉంటుంది. వర్గ వ్యూహాన్ని, భారత విప్లవ పంథా రూపురేఖలను పార్టీ కార్యక్రమం వక్కాణిస్తున్నది. విప్లవాన్ని జయప్రదం చేసేందుకు పార్టీ నిబంధనావళి అవసరం. అందుకే పార్టీ నిర్మాణానికి, నిబంధనావళి మైలురాయి వంటిది.

**సిపిఐ(యం) కార్యక్రమాన్ని ఈ క్రింది నాలుగు సెక్షన్‌లలో అధ్యయనం చేయవచ్చు:**

అ. పార్టీ కార్యక్రమాన్ని అర్థం చేసుకునేందుకు ఐదు మౌళిక భావనలు.

ఆ. పార్టీ కార్యక్రమం ఐదు లక్షణాలు.

ఇ. పార్టీ కార్యక్రమం సారాంశమైన ఐదు ప్రశ్నలు, సమాధానాలు.

ఈ. పార్టీ కార్యక్రమంలోని ఎనిమిది ప్రధాన సెక్షన్‌లు.

# పార్టీ కార్యక్రమాన్ని తాజాపరచటం

1964 నవంబరు, కలకత్తాలో జరిగిన 7వ మహాసభలో సిపిఐ(యం) కార్యక్రమం ఆమోదించబడింది. ఆ మహాసభలోనే సిపిఐ(యం) ఏర్పడింది. 1990 దశాబ్దపు ప్రథమార్ధంలో జాతీయ, అంతర్జాతీయ పరిస్థితుల్లో ప్రధాన మార్పులు జరిగాయి. ఆ మార్పులకు అనుగుణంగా 1992 చెన్నయ్‌లో జరిగిన పార్టీ 14వ మహాసభలో, పార్టీ కార్యక్రమాన్ని తాజాపరచాలన్న ముఖ్యమైన నిర్ణయం చేయబడింది. తాజా పరచబడిన కార్యక్రమం ముసాయిదా తీర్మానంపై దేశ వ్యాపితంగా, పార్టీలో మూడు నెలల పాటు తీవ్రమైన, విస్తృతమైన అంతర్గత చర్చలు జరిగాయి. అంతిమంగా, 2000 అక్టోబరులో తిరువనంతపురంలో జరిగిన ప్రత్యేక మహాసభలో తాజాపరచబడిన పార్టీ కార్యక్రమం అమోదించబడింది.

అంతర్జాతీయ పరిస్థితుల్లో ప్రధానమైన మార్పు, 1989-1991 మధ్య కాలంలో తూర్పు యూరపు, సోవియట్ యూనియన్‌లలో సోషలిజం కూలిపోయింది. ఫలితంగా, ప్రపంచవ్యాపితంగా సామ్రాజ్యవాదం దూకుడు ప్రారంభమైంది. ప్రమాదకరమైన ఈ పరిణామం, ప్రపంచ స్థాయి వర్గ శక్తుల బలాబలాలను పూర్తిగా మార్చేసింది. ప్రపంచవ్యాపితంగా, శ్రామిక ప్రజానీకానికి, వామపక్ష అభ్యుదయ శక్తులకు వ్యతిరేకంగా హానికరమైన ప్రభావాన్ని కల్గించింది. అది, పార్టీ కార్యక్రమాన్ని తాజాపరిచేందుకు మొదటి ప్రధాన కారణమైంది.

జాతీయ పరిస్థితుల్లో, రెండు ప్రధాన మార్పులు జరిగాయి. ఒకటి. 1991లో, కేంద్రంలోని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం సామ్రాజ్యవాదుల లొంగిపోయింది. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ తాఖీదులకు (యల్‌పిజి) నయా ఉదారవాద విధానాలకు తెరలేపింది. సామ్రాజ్యవాదుల ఈ మితిమీరిన తాఖీదులు తూర్పు యూరపు, సోవియట్ యూనియన్‌లో సోషలిజం కూలిపోయిన సహజ ఫలితమే. ఈ యల్‌పిజి విధానాలను అనంతర కాలంలో దేశంలో గద్దెనెక్కిన కేంద్ర ప్రభుత్వాలన్నీ ముందుకుతీసుకెళ్లాయి. రెండవ అంశం. 1980 అంతిమార్థంలో, ఆర్‌యస్‌యస్, దాని సంఘ్‌పరివార్ శక్తులు ప్రేరేపించిన అతి తీవ్రమైన మతోన్మాద ప్రమాదం తారాస్థాయికి చేరటం. 1992 డిసెంబరు 6న, బాబ్రీ మసీదును కూల్చటంతో ఆ ఉన్మాదం పతాకస్థాయికి చేరింది. అంతిమంగా, 1998లో బిజెపి కేంద్రంలో అధికారాన్ని కైవశం చేసుకుంది. జాతీయ పరిస్థితుల్లో జరిగిన పై రెండు ముఖ్యమైన పరిణామాల పర్యవసానంగానే పార్టీ కార్యక్రమాన్ని తాజాపర్చవలసివచ్చింది.

ప్రధాన పరిణామాల నేపథ్యంలో కార్యక్రమంలోని పలు సెక్షన్‌లను తాజాపర్చవలసి వచ్చింది. కానీ, 1964లో రూపొందించుకున్న జనతా ప్రజాస్వామిక విప్లవానికి మూలాధారమైన 'వర్గ వ్యూహం' మాత్రం యధాతధంగా ఉంటుంది. ఆ వర్గ వ్యూహం నేటికీ సమానంగా చెల్లుబాటౌంతుంది. అందుకే, 'పార్టీ కార్యక్రమం తాజాపర్చబడింది తప్ప సంస్కరించబడలేద'ని మనం స్పష్టంగా చెప్పగలం.

నేటి జాతీయ, అంతర్జాతీయ పరిస్థితుల్లో రాజకీయంగా అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాం. ఈ సంక్లిష్ట పరిస్థితుల్లో, పార్టీ కార్యక్రమంపై తగినంత పట్టు సాధించాలి. దానితోపాటు, అది నిర్ధేశించిన విప్లవ పంథాకు ఎంతో పెద్ద ప్రాధాన్యత ఉంది. పార్టీ అధ్యాపకులు ఈ అంశాన్ని బోధించే ముందు, పార్టీ కార్యక్రమం డాక్యుమెంటును క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని, అర్థం చేసుకోవాలని చెప్పనవసరం లేదు. ఆ అధ్యయనానికి, 'కార్యక్రమం'కు అనుబంధంగా మాత్రమే రూపొందించబడిన ఈ 'నోట్' ఉపకరిస్తుంది.

## ఎ. పార్టీ కార్యక్రమాన్ని అర్థం చేసుకునేందుకు ఐదు మూల అంశాలు

**1. పార్టీ కార్యక్రమం : ఇది, ఒక నిర్ధిష్టమైన విప్లవ దశను పూర్తిచేసేందుకు కమ్యూనిస్టు పార్టీ నిర్ణయించిన వర్గ వ్యూహం.**

వ్యూహానికి, ఎత్తుగడలకు మధ్య తేడాను అర్థం చేసుకోవటం ముఖ్యం. సూక్ష్మంగా చెప్పాలంటే, ఒక యుద్ధాన్ని గెలిచేందుకు ఉపకరించే సమగ్ర పథకమే 'వ్యూహం'. ఆ యుద్ధంలోని, నిర్ధిష్ట పోరాటాల్లో గెలుపొందేందుకు ఉద్ధేశించిన పథకాలే 'ఎత్తుగడలు'. ఉదాహరణకు: జర్మన్ నాజీ ముప్పుకు వ్యతిరేకంగా నాలుగు సంవత్సరాలుగా సాగుతున్న రెండవ ప్రపంచ యుద్ధంలో గెలిచేందుకు సోవియట్ యూనియన్, రెడ్ ఆర్మీ ఒక దీర్ఘకాల వ్యూహాన్ని రూపొందించాల్సి వచ్చింది. అందుకు, మాస్కో, లెనిన్‌గ్రాడ్, స్టాలిన్‌గ్రాడ్, కరస్క్‌వంటి చోట్ల ప్రాంతీయ పోరాటాల్లో వారు నెగ్గాలి. అందుకోసం వారు నిర్ధిష్ట ఎత్తుగడలను కూడా రూపొందించుకున్నారు. అదేవిధంగా, జనతా ప్రజాస్వామిక విప్లవం సాధనకు మన పార్టీ ప్రణాళిక ఒక వ్యూహాన్ని నిర్ధేశించింది. వేరొక వైపున, మన పార్టీ మహాసభలు, కేంద్ర కమిటీ

రాజకీయ తీర్మానాలను రూపొందిస్తాయి. ఆ తీర్మానాలే, నిర్దిష్ట రాజకీయ సవాళ్లను ఎదుర్కొనేందుకు ఉపకరించేవే 'ఎత్తుగడలు'. మన వ్యూహానికి అనుగుణంగానే నిరంతరం మన ఎత్తుగడలు ఉండటం ముఖ్యం.

**2. విప్లవం : రాజ్యాధికారం నుండి ఒక వర్గాన్ని తోసేసి నూతన వర్గం అధీష్టించటం. ఆ నూతన వర్గం, చారిత్రకంగా అత్యంత అభివృద్ధికరమైనదిగా ఉంటుంది. ప్రధానమైన రాజకీయ, ఆర్థిక, సామాజిక పరివర్తనకు ఆ వర్గపు నేతృత్వం దారి చూపుతుంది.**

1789 ఫ్రెంచి విప్లవంలో, భూస్వామ్య వర్గపు రాజ్యాధికారాన్ని బూర్జువా వర్గం కూలదోసింది. భూస్వామ్య వ్యవస్థ స్థానంలో పెట్టుబడిదారీ వ్యవస్థను నెలకొల్పింది. అదే విధంగా, 1917 రష్యా విప్లవంలోను, 1949 చైనా విప్లవంలోను బూర్జువా భూస్వామ్య వర్గాలను రాజ్యాధికారం నుండి  కార్మిక–కర్షక ఐక్య సంఘటనకు నాయకత్వం వహిస్తున్న కార్మిక వర్గం కూలగొట్టింది. భూర్జువా – భూస్వామ్య వ్యవస్థ స్థానంలో సోషలిస్టు వ్యవస్థను ప్రతిష్టించింది. వాస్తవ అర్థంలో,  పైన ఉదహరించిన మూడు సంఘటనలన్నీ విప్లవాలే. కేవలం ప్రభుత్వాల మార్పే విప్లవం కాదన్న సత్యాన్ని ఇక్కడ  నొక్కిచెప్పాలి.

చారిత్రక భౌతికవాదం సూత్రాల ప్రకారం – నూతన ఉత్పత్తి శక్తులకు, పాత ఉత్పత్తి సంబంధాలకు మధ్య వైరుధ్యాలు తీవ్రతరమౌతాయి. పెట్టుబడిదారీ వ్యవస్థలో, ఉత్పత్తి సాధనాలపై వ్యక్తిగత – ప్రైవేటు యాజమాన్యానికి, సోషలిస్టు స్వభావంగల ఉత్పత్తికి మధ్య ప్రధాన వైరుధ్యం నెలకొంటుంది. ఈ వర్గ పోరాటం  ఒక నిర్ణయాత్మక దశకు చేరినపుడు, విప్లవానికి దారితీస్తుంది. కానీ ఒక విప్లవం జయప్రదమయ్యేందుకు భౌతికపరమైన (పరిస్థితులు అనుకూలంగా ఉండాలి) మరియూ వస్తుగతమైన (విప్లవ శక్తులు సంసిద్ధంగాను, సమర్థవంతంగాను ఉండి తీరాలి) పరిస్థితులు రెండూ కార్యరూపందాల్చాలి.

కానీ, 1991లో సోవియట్ యూనియన్‌లో ఈ సూత్రం తలకిందులైంది.  అక్కడ రాజ్యాధికారం కార్మిక వర్గం నుండి తిరిగి పెట్టుబడిదారీ వర్గం వశమైంది. దీన్నే 'ప్రతీఘాత విప్లవం' అంటారు. ఈ సోవియట్ అనుభవం ఒక కీలకమైన గుణపాఠాన్ని నేర్పుతున్నది. అది, సాధించిన విప్లవాన్ని సంరక్షించుకోకుంటే, పురోగమింపచేయకుంటే సోషలిస్టు విప్లవమైనా తలకిందులౌతుంది. అక్కడి సోషలిజాన్ని, ఆ విప్లవ విజయాలను

వమ్ముచేసేందుకు ఆ దేశంలోని అభివృద్ధి నిరోధక శక్తులతో సామ్రాజ్యవాద శక్తులు కుమ్మక్కైనాయి. అందుకే, విప్లవశక్తులు నిరంతరం అప్రమత్తంగా ఉండి కాచుకోవాలి. ప్రజల నుండి దూరం చేసే పొరపాట్లను నివారించాలి. తద్వారా, వర్గ శత్రువుకు అవకాశం లభించకుండా జాగృతం కావాలి.

**3. వర్గ పోరాటం : దోపిడీ వర్గాలకు, దోపిడీకి గురయ్యే వర్గాలకు మధ్య జరిగే పోరాటమే వర్గ పోరాటం. ఆ రెండు వర్గాల ప్రయోజనాలు స్పష్టంగా పరస్పరం వ్యతిరేకమైనవి.**

'కమ్యూనిస్టు ప్రణాళిక'లో మార్క్స్, ఏంగెల్స్ ఇలా పేర్కొన్నారు : "ఇంతవరకూ సాగిన సమాజ చరిత్ర అంతా వర్గ పోరాటాల చరిత్రే." సాధారణంగా చెప్పాలంటే, ఉత్పత్తి సాధనాలపై యాజమాన్యం కలవారిని 'దోపిడి వర్గాలు' అంటారు. వాటిపై యాజమాన్యం లేనివారిని 'దోపిడికి గురయ్యే వర్గాలు' అంటారు. ఆ రెండు వర్గాల మధ్య ఎడతెగని పోరాటాన్నే 'వర్గ పోరాటం' అంటారు.

**వర్గ పోరాటాలు పలు రూపాల్లో ఉన్నాయి. అవి : 1. ఆర్థిక పరమైనవి, 2. రాజకీయపరమైనవి, 3. సామాజకపరమైనవి, 4. సైద్ధాంతికపరమైనవి, 5. సంస్కృతి– సాహిత్యపరమైనవి.**

ఆర్థిక రంగంలో వర్గపోరాటం – అత్యంత ప్రాథమికమైన, సార్వత్రికమైన వర్గ పోరాట రూపం. ఉదాహరణ : వేతనాల పెంపుదల, సామాజిక భద్రత కోసం కార్మికులు, వ్యవసాయ కార్మికుల పోరాటాలు; తమ పంటలకు గిట్టుబాటు ధరల కోసం రైతాంగ పోరాటాలు వగైరా. కానీ లెనిన్ స్పష్టంగా పేర్కొన్నట్లు, "కేవలం ఆర్థిక రంగంలో ఎంత విస్తృతము, తీవ్రమైన వర్గ పోరాటం జరిగినప్పటికీ, అది మాత్రమే విప్లవానికి దారితీయదు." ఈ అంశాన్ని నిరూపించేందుకు అనేక ఉదాహరణలను పేర్కొనవచ్చు.

శ్రామిక ప్రజల రాజకీయ, వర్గ చైతన్యాన్ని పెంచడమే కమ్యూనిస్టు పార్టీ కర్తవ్యం. ఆర్థిక పోరాటాలలో వారు గడించిన అనేక స్వీయ అనుభవాల ఆధారంగా ఆ కర్తవ్యాన్ని నెరవేర్చాలి. రాజకీయ రంగంలో వర్గ పోరాటాన్ని తీవ్రతరం చేయాలి. ఆ విధంగా మాత్రమే, దోపిడి వర్గాల నుండి రాజ్యాధికారాన్ని స్వాధీనం చేసుకోగలమన్న స్థాయికి ప్రజల చైతన్యాన్ని పెంచగల్గుతాం. ఆ స్థాయి చైతన్యమే, విప్లవ సాధనకు

మార్గాన్ని సుగమం చేస్తుంది. ఆ విధంగా, రాజకీయ రంగంలో వర్గ పోరాటమే అత్యున్నత స్థాయి వర్గ పోరాటంగా గుర్తించాలి.

ఈ రాజకీయ వర్గ పోరాటానికి సామాజిక, సైద్ధాంతిక, సంస్కృతి–సాహిత్య రూపాల్లో జరిగే వర్గ పోరాటాలు గొప్పగా సహకరిస్తాయి.

సామాజిక రంగంలో వర్గపోరాటం – భారతదేశంలో సామాజిక వర్గపోరాటాలకు అపారమైన ప్రాధాన్యత సంతరించుకుంది. అందుకు దోహదం చేస్తున్న అనేక సామాజిక అంశాలు : ప్రగతి నిరోధకమైన వర్ణ, కులవ్యవస్థలు; మహిళల అణచివేతలు; మహిళలు, దిగువ కులాల పట్ల పూర్తి వ్యతిరేకత కూడుకట్టుకున్న 2000 ఏళ్ల నాటి మనుస్మృతి; నయా ఉదారవాద విధానాల దాడులతో తీవ్రమౌతున్న సామాజిక దౌర్జన్యాలు, అణచివేతలు, వివక్షతలు, అసమానతలు; మైనారిటీలపై మతోన్మాద అల్లర్లు, దాడులు – ఇలాంటివే మరి కొన్ని సమస్యల మూలంగానే సామాజిక రంగంలో వర్గ పోరాటానికి ప్రాధాన్యత మరింత సమకూరింది. అందువల్లనే, కమ్యూనిస్టు పార్టీ దేశంలో నడపిన సామాజిక సంస్కరణోద్యమాల సంపద్వంతమైన వారసత్వాన్ని, నూతన రీతుల్లో చైతన్యయుతంగా ఆవిష్కరించేందుకు కృషిచేయాలి. రాజారామ్మోహన్‌రాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, మహాత్మా జ్యోతీరావు ఫ్యూలే. సావిత్రీబాయి ఫ్యూలే, షాహు మహారాజ్, ఇవి రామస్వామి పెరియార్, నారాయణ గురు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌లు ఆ సామాజిక ఉద్యమాలకు ప్రాతినిధ్యవహిస్తున్న పటిష్టమైన నేతలుగా వెలుగొందారు. కమ్యూనిస్టుపార్టీ ఆర్థిక దోపిడీపై పోరాటాలను సాగించింది. పార్టీ, ఆదే ఉత్సాహంతోనే సామాజిక అణచివేతలపై కూడా పోరాటాలు సాగించాలి.

సైద్ధాంతిక రంగంలో వర్గ పోరాటం – సామ్రాజ్యవాదం దాడులకు, నయా–ఉదారవాద విధానాలకు, మతోన్మాదానికి, కులతత్వానికి, అస్థిత్వవాద రాజకీయాలకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడుతుంది. ఇది జరుగకుండా, మనం ప్రజల మనసులను గెల్చుకోలేం. వారిని, మన వైపు సమీకరించలేం. సంస్కృతి – సాహిత్య రంగాల్లో వర్గపోరాటాలను కూడా అదే లక్ష్యంతో సమర్థవంతంగా కొనసాగించాలి. అభ్యుదయ రచయితల సంఘం (పిడబ్లుఎ), ఇండియన్ పీపుల్స్ థీయటర్ అసోసియేషన్ (ఐపిటిఎ) వంటి పలు సంస్థల్లోని అభివృద్ధి కాముకులైన సాంస్కృతిక–సాహిత్యకారుల తేజోవంతుల సమూహం ఈ పోరాటాన్ని ముందుకుతీసుకెళ్లారు. నేడు, దేశ వ్యాపితంగా

జన్‌వాదీ లేఖక్ సంఘ్, జనమ్, సహమత్, లెఫ్ట్ వర్డ్‌వంటి అనేక సంస్థలు పోరాటాన్ని ముందుకుతీసుకెళ్తున్నాయి.

**4. రాజ్యం (స్టేట్) : దోపిడీకి గురయ్యే వర్గాలను అణచేసేందుకు, దోపిడి వర్గాల చేతిలో వ్యవస్థీకృతమైన వర్గ సాధనమే రాజ్యం.**

నేటి భారతదేశ బూర్జువా – భూస్వామ్య రాజ్యంలో, దోపిడికి గురయ్యే వర్గాలను అణచేందుకు, వారిని అదుపుచేసి తమ చెప్పుచేతల్లో పెట్టుకునేందుకు దోపిడిచేసే పాలక వర్గాలు రాజ్యంలోని పలు విభాగాలను వినియోగించుకుంటున్నాయి. రాజ్యం ముఖ్యమైన విభాగాలైన ప్రభుత్వము, పోలీసు, సైన్యము, జైళ్లు, అధికార బృందము, న్యాయ వ్యవస్థ వంటివి అన్నీ ప్రజలకు వ్యతిరేకమైనవే. రాజకీయ ప్రత్యర్థులకు వ్యతిరేకంగా ఇడి, సిబిఐ, ఇన్‌కం టాక్స్ (ఐటి) వంటి పలు స్వతంత్రమైన రాజ్యాంగబద్ధ సంస్థలను పాలక వర్గాలు దుర్వినియోగం చేస్తున్నాయి. అత్యధిక భాగం ప్రింటు, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలు పలు కార్పోరేట్ సంస్థల యాజమాన్యంలోనే ఉన్నాయి. అవి, పత్రికా స్వేచ్ఛను గాలికి వదిలేశాయి. నిస్సిగ్గుగా పాలక పార్టీని బలపరుస్తున్నాయి. పాలక వర్గాలకు అనుకూలంగా ప్రజాభిప్రాయాన్ని మలచేందుకు ప్రయత్నిస్తున్నాయి. పాలక వర్గాలు వారి రాజకీయ పార్టీలు (ప్రత్యేకంగా బిజెపి) కాలం తీరిన మతం, కులం, తెగ, భాష, వంటి కాలం తీరిన అంశాలను వినియోగించి ప్రజలను చీల్చేందుకు ప్రయత్నిస్తున్నాయి. బిజెపి – ఆర్‌యస్‌యస్‌ల పాలనలో కార్పోరేట్ అనుకూల, ప్రజా వ్యతరేక విధానాలతోపాటు నయా – ఉదారవాద విధానాలను నిస్సిగ్గుగా అమలుపరుస్తున్నట్లు స్పష్టమౌతున్నది.

పై రెండు అంశాలపై, లెనిన్ సైద్ధాంతిక మూల గ్రంథం – 'రాజ్యం, విప్లవం' లో లోతైన వివరణ పొందుపర్చబడింది. అందుకే ఈ సందర్భంగా ఆ గ్రంధాన్ని చురుకైన విప్లవకారులందరూ జాగ్రత్తగా అధ్యయనం చేయాలి.

**5. సోషలిజం : సోషలిజం అంటే ఉత్పత్తి సాధనాలపై ప్రైవేటు యాజమాన్యాన్ని రద్దుచేయటం. ఆ యాజమాన్యాన్ని మొత్తం సమాజం చేతికి**

**బదిలీ చేయటం. తద్వారా, మనిషిని మనిషి దోపిడీ చేయటాన్ని అంతం చేయటం.**

ఉత్పత్తి సాధనాలపై ప్రైవేటు యాజమాన్యానికి, దోపిడీ ప్రక్రియకు మధ్య నెలకొన్న అవిచ్ఛిన్నమైన సంబంధం గురించి మార్క్సిస్టు రాజకీయ అర్థశాస్త్రంలో వివరించబడింది. మొదట. ఉత్పత్తిలో పెట్టుబడిదారీ, భూస్వామ్య దోపిడి సంబంధాలు సోషలిజంలో అంతరిస్తాయి. రెండు. ఉత్పత్తి శక్తులను బంధ విముక్తులను చేయటం ద్వారా, సోషలిజంలో ఉత్పత్తి భారీగా పెరుగుతుంది. 'లాభం కోసం ఉత్పత్తి' లక్ష్యాం 'అవసరం కోసం ఉత్పత్తి'గా మార్పు చేయబడుతుంది. మూడు. సోషలిజంలో, 'అతడు / ఆమె శక్తి కొద్దీ పని, అతడు/ఆమె పనిని బట్టి వినియోగం' సూత్రం అమల్లోకి వస్తుంది.

పై మూడు అంశాలు అమలు చేయటం ద్వారా పేదరికం, ఆకలి, నిరుద్యోగం, అవిద్య, అనారోగ్యం, అసమానతలు వంటి రుగ్మతలకు దారితీసిన మార్గాలన్నీ సోషలిజంలో మూతబడతాయి. భౌతిక శ్రమకు, మానసిక శ్రమకు మధ్య; పట్టణాలకు, గ్రామాలకు మధ్య; స్త్రీ, పురుషుల మధ్య; నిలిచిన అడ్డుగోడలు, వివక్షతలు తగ్గిపోవటం మొదలౌతుంది. సోషలిజంలో మతోన్మాదము, కులతత్వము, మహిళల అణచివేతలు వంటి అరాచకాల ఉడుం పట్టు సడలిపోతుంది. కానీ అందు కోసం, విప్లవానంతరం కూడా ఈ సమస్యలపై పోరాటాన్ని దృఢ సంకల్పంతో కొనసాగించాలి. తద్వారా సోషలిజంలో, క్రమంగా నూతన స్త్రీ, పురుషులు రూపొందుతారు. నూతన విలువలు ఆవిష్కరించబడతాయి.

ఒక సోషలిస్టు దేశం, తన దేశంపై ఏ ఇతర దేశపు దోపిడిని అనుమతించదు. తను ఏ ఇతర దేశాన్నీ దోపిడి చేయదు. సోషలిజం – ప్రపంచంలో తనతోపాటు, విప్లవకారులు, కమ్యూనిస్టు శక్తులందరికీ; దోపిడి, దురాశలకు నెలవైన సామ్రాజ్యవాదాన్ని అతిపెద్ద శత్రువుగా పరిగణిస్తుంది. అందుకే, సోషలిస్టు విప్లవాలు జయప్రదమైన రష్యా, చైనా, వియత్నాం, కొరియా, క్యూబా దేశాలు సామ్రాజ్యవాదాన్ని ఓడించాక మాత్రమే విజేతలుగా నిలిచాయి. వేరొక వైపున జర్మనీ, ఇటలీ, స్పెయిన్, ఇండోనీషియా, చిలీల్లోని బాధాకరమైన అనుభవాలు మన ముందున్నాయి. సామ్రాజ్యవాదము, ఫాసిజంతోపాటు, ఆయా దేశాల్లోని అరాచక శక్తుల దుష్ట కూటమి – అక్కడి కమ్యూనిస్టులు, సోషలిస్టులు, ప్రజాతంత్ర శక్తులన్నింటినీ క్రూరంగా మట్టుపెట్టాయి.

## బి.పార్టీ ప్రణాళిక – ఐదు లక్షణాలు

**1. భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో, భారత దేశపు నిర్ధిష్ట పరిస్థితులకు మార్క్సిజం–లెనినిజంను సక్రమంగా అన్వయించేందుకు పలు ప్రయత్నాలు జరిగాయి. వాటిలో మొదట జయప్రదమైనది సిపిఐం కార్యక్రమమే.**

పార్టీ కార్యక్రమాన్ని రూపొందించేందుకు గతంలో జరిగిన పలు ప్రయత్నాల వివరణలు, వ్యాఖ్యలతో కూడిన సమాచారాలను హరికిషన్ సింగ్ సూర్జిత్ సమకూర్చారు. పార్టీ కార్యక్రమానికి సంబంధించిన కొన్ని మౌళిక సూత్రాలు పార్టీపై నిషేధ కాలం (1921,1922)లో నివేదించబడ్డాయి. అవి, భారత జాతీయ కాంగ్రెస్ మహాసభ (అహమ్మదాబాద్, గయ)ల్లో 'సంపూర్ణ స్వాతంత్ర్యం' నినాదాల రూపంలో ప్రతిధ్వనించాయి.

1930లో 'కార్యాచరణ వేదికకు ముసాయిదా' (డ్రాఫ్టు ప్లాట్ ఫారం ఆఫ్ యాక్షన్) తయారైంది. నాటి బ్రిటీష్ పాలకులు కమ్యూనిస్టు పార్టీపై తీవ్రమైన అణచివేతలు అమలుచేస్తున్న పరిస్థితుల్లో ఆ ముసాయిదా రూపొందింది. నాటికింకా, భారత కమ్యూనిస్టు పార్టీకి ఒక కేంద్రీకృత నాయకత్వం ఉనికిలోకి రాలేదు. మీరట్ కుట్ర కేసు ఖైదీలు విడుదలయ్యాక, 'రాజకీయ సిద్ధాంత ముసాయిదా' (డ్రాఫ్ట్ పొలిటికల్ థీసీస్) పేరిట కార్యక్రమం రెండవ డాక్యుమెంటును 1933 డిసెంబరులో, తాత్కాలిక కేంద్ర కమిటి ఆమోదించింది. 1935లో కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ (సిఐ) 7వ మహాసభ జరిగింది. ఆ తర్వాత 1936లో, 'ప్లాట్‌ఫాం ఆఫ్ యాక్షన్' పేరిట కార్యక్రమం మూడవ డాక్యుమెంటు ఆమోదించబడింది. ఈ 'ప్లాట్‌ఫాం ఆఫ్ యాక్షన్' కార్యక్రమం ప్రాతిపదికపై మన పార్టీని తన సభ్యురాలిగా కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ గుర్తించింది.

1943లో బొంబాయిలో జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ మొదటి మహాసభ సందర్భంగా, కార్యక్రమం సమస్యపైన మార్గదర్శకాల రూపంలో కొన్ని స్పష్టమైన సూచనలు చేయబడ్డాయి.

1951లో, అజయ్‌ఘోష్, యం.బసవపున్నయ్య, యస్.ఎ డాంగే, సి.రాజేశ్వరరావులతో కూడిన పార్టీ బృందం మాస్కో వెళ్ళి, జోసెఫ్ స్టాలిన్‌తో పాటు ఇతర సిపియస్‌యు నాయకులను కలిశారు. అవిభక్త సిపిఐలో తదుపరి కొంత ప్రయత్నం జరిగింది. సిపియస్‌యుతో చర్చల అనంతరం రూపొందించిన పార్టీ కార్యక్రమం ముసాయిదాను ప్రత్యేక మహాసభ ఆమోదించింది. కానీ నాలుగు

సంవత్సరాల తర్వాత 1956లో, పలు లోపాల కారణంగా, దాన్ని తాత్కాలికంగా ఆపేయాలని అవిభక్త కమ్యూనిస్టు పార్టీ నిర్ణయించింది. ఆ విధంగా, పార్టీ కార్యక్రమం రూపొందిన సరళి అనేక మెలికలు, వంపులతో సాగింది.

అంతిమంగా, 1964 కలకత్తాలో కొత్తగా ఏర్పడిన సిపిఐ(ఎం) 7వ మహాసభలో ఒక పార్టీ కార్యక్రమం ఆమోదించబడింది. 2000ల్లో తాజాపర్చబడే వరకూ అది అమల్లో ఉంది. భారత్‌లో మనుగడలో ఉన్న నిర్దిష్ట పరిస్థితులకు మార్క్సిజం - లెనినిజాన్ని సక్రమంగా అమలు చేసేందుకు పలు ప్రయత్నాలు జరిగాయి. ఆ లక్ష్య సాధనలో భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో, ఇది జయప్రదమైన ప్రయత్నం.

**2. 1964కు ముందు రెండు దశాబ్దాలపాటు భారత కమ్యూనిస్టు ఉద్యమంలో, తీవ్రమైన అంతర్గత రాజకీయ - సైద్ధాంతిక పోరాటం జరిగింది. ఆ అంతర్గత పోరాటం ఫలితమే సిపిఐ(యం) కార్యక్రమం.**

ఏ అంశాలపై పార్టీలో అంతర్గత పోరాటం జరిగిందనే అంశాన్ని ఈ నోట్‌లోనే తర్వాత వివరంగా చర్చిద్దాం. ఈ అంతర్గత పోరాటానికి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల రాజ్యహింసలు, అణచివేతలు తోడయ్యాయి. భారత - చైనా సరిహద్దు వివాదాన్ని వినియోగించుకుని 1962-66 మధ్య వందలాది నాయకుల (ఇంకనూ సిపిఐ(యం)గా రూపొందవలసిన వారు)ను 'డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్స్' కింద నిర్బంధించారు. ఈ పరిస్థితిని, అనేక రాష్ట్రాల్లో పార్టీ యంత్రాంగంపై తమ పట్టు సాధించేందుకు సిపిఐలోని ఒక భాగం వినియోగించుకుంది.

సిపిఐలో మొదటి చీలిక అనంతరం, 1964లో కొత్తగా ఏర్పడిన సిపిఐ(యం)లో 1967-1968 కాలంలో నక్సలైట్‌లు మరొక తీవ్రమైన విచ్ఛిన్నానికి పాల్పడ్డారు. ఆ విధంగా, ఈ కాలంలో సిపిఐ రైట్ రివిజనిజానికి, నక్సలైట్ల వామపక్ష ఒంటెత్తువాదానికి వ్యతిరేకంగా స్థిరమైన, బాధాకరమైన (బిట్టర్) పోరాటం చేయవలసివచ్చింది.

**3. సిపిఐ(యం) కార్యక్రమాన్ని రూపొందించటంలోను. దాన్ని పరిరక్షించటంలోను ప్రపంచంలో అధికారంలో ఉన్న అతిపెద్ద కమ్యూనిస్టు పార్టీలైన కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ సోవియట్ యూనియన్ (సిపియస్‌యు), కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ చైనా (సిపిసి)లపై తీవ్రమైన సైద్ధాంతిక పోరాటం చేయవలసివచ్చింది.**

ఈ సంక్లిష్ట కాలంలో సిపియస్‌యు సంపూర్ణంగా సిపిఐని బలపరచింది. సిపిఐ(యం)ను "చీలికవాదులు, వామపక్ష దుందుడుకువాదులు..." వగైరా ముద్రలువేసి నిందించింది. ప్రపంచంలో, సోవియట్ కమ్యూనిస్టు పార్టీకి సన్నిహితమైన పలు కమ్యూనిస్టు పార్టీలు కూడా అదే వైఖరిని అవలంబించాయి. సిపియస్‌యు నుండి సిపిఐ మద్దతు పొందింది. పర్యవసానంగా, ఆ రెండు పార్టీలూ 1975-77 మధ్య కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన నియంతృత్వ అత్యవసర పరిస్థితిని బాహాటంగా బలపరిచేందుకు దారితీసింది.

వేరొక వైపున, చైనాలో ఘనంగా ప్రకటించబడి 1966లో ప్రారంభమైన 'సాంస్కృతిక విప్లవం' అనంతరం, సిపిసి నక్సలైట్లను పూర్తిగా బలపరిచింది. సిపిఐ(యం)ను 'నయా రివిజనిస్టులు'గా ముద్రవేసింది. ఆ విధంగా సిపిఐ(యం) ఏర్పడిన రెండు దశాబ్దాల తర్వాత మన పార్టీ ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం నుండి పూర్తిగా వేరుపడిపోయింది. వియత్నాం కమ్యూనిస్టు పార్టీ (సిపివి) అందుకు మినహాయింపుగా నిలిచింది. ఆ పార్టీ, మన పార్టీతో సోదర సంబంధాలను కొనసాగించింది.

1977 సాధారణ ఎన్నికల ఫలితాలతో దేశంలో రాజకీయ పరిస్థితులు తిరగబడ్డాయి. అత్యవసర పరిస్థితిని విధించిన కాంగ్రెస్ ఘోర పరాజయం పాలయింది. ఆ ఎన్నికల్లో, సిపిఐ(యం) పురోగమించింది. సిపిఐ క్షీణించింది. ఆ వెంటనే జరిగిన ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్, త్రిపుర, కేరళ రాష్ట్రాల్లో సిపిఐ(యం) నాయకత్వంలో వామపక్ష ప్రజాతంత్ర సంఘటన ప్రభుత్వాలు ఏర్పడ్డాయి.

ఈ పరిణామాల అనంతరం, 1980 ఆరంభంలో, సిపియస్‌యు, సిపిసి, ప్రపంచంలోని ఇతర కమ్యూనిస్టు పార్టీలు సిపిఐ(యం)తో తమ సోదర సంబంధాలను పునరుద్ధరించాయి. కానీ, మన పార్టీ భారత ప్రజానీకంలో తన బలాన్ని నిరూపించుకున్న తర్వాత మాత్రమే పై పరిణామాలు జరిగాయి.

**4. ఒక్క సిపిఐ(యం) కార్యక్రమం మాత్రమే, గత 60 (షుమారుగా) సంవత్సరాల కాలపరీక్షలో నెగ్గింది.**

సిపిఐ(యం) కార్యక్రమంలోని ప్రాథమిక సూత్రీకరణలను మార్చనవసరం లేకుండా ఉన్నాయి. అదే సందర్భంలో, 1964 తర్వాత సిపిఐ తన కార్యక్రమంలో అనేక ప్రధాన మార్పులు చేసుకోవలసివచ్చింది. కానీ, ఇప్పటికీ, ఆ పార్టీ కార్యక్రమంలో అనేక లోపభూయిష్టమైన సూత్రీకరణలు కొనసాగుతున్నాయి. నక్సలైట్లకు

సంబంధించినంత వరకూ మౌళిక సైద్ధాంతిక అంశాల్లో దివాళా కోరుతనంవల్ల, అనంతర కాలంలో వారు అనేక ముఠాలుగా విడిపోయారు. వాటిలో అత్యధిక ముఠాలకు సొంత ప్రత్యేక కార్యక్రమాలున్నాయి. వాటిలో ఒకటైన సిపిఐ(యంయల్-లిబరేషన్), ప్రాథమికమైన నక్సలైట్ పనిపద్ధతులను వీడాక బీహారు రాష్ట్రంలో కొంత ముందడుగు వేస్తున్నది. నిషేధించబడిన సిపిఐ (మావోయిస్టు) హింసను కొనసాగిస్తున్నది. వారు, కొన్ని అటవీ ప్రాంతాలకు పరిమితమయ్యారు.

**5. సిపిఐ(యం) కార్యక్రమం కోసం మొత్తం పార్టీ పోరాడినప్పటికీ, నవరత్నాలుగా గుర్తింపు పొందిన మొదటి పోలిట్‌బ్యూరో సభ్యుల పాత్ర చాలా కీలకమైనది, ఎంతో విలువైనది.**

సిపిఐ(యం) ప్రథమ పోలిట్‌బ్యూరో సభ్యులు నవరత్నాలుగా గుర్తింపుపొందారు. వారు, పార్టీ కార్యక్రమం రూపకల్పనకు, పరిరక్షణకు పార్టీలో రాజకీయ – సైదాంతిక అంతర్గత పోరాటం నిర్వహణకు నాయకత్వం వహించారు. ఈ కృషిలో వారు నిర్వహించిన పాత్ర చాలా కీలకమైనది, ఎంతో విలువైనది. ఈ సందర్భంగా వారు రచించిన అనేక మూల (సెమినల్) డాక్యుమెంట్లు నేటికీ ఎంతో ముఖ్యమైనవిగా ఉన్నాయి. స్వాతంత్రం కోసం బ్రిటీష్ సామ్రాజ్యవాద వ్యరేక పోరాటంలో వారందరూ రాటుదేలారు. వారు స్వాతంత్ర్యానికి ముందు, అనంతరం కూడా అనేక సంవత్సరాలు జైళ్ల నిర్భంధంలో గడిపారు. వారందరూ అనేక వర్గ, ప్రజా పోరాటాల్లో అగ్రభాగాన నిలిచారు. ఈ క్రమంలో వారు విస్తృతమైన, లోతైన అనుభవం గడించారు. ఈ అనుభవంతో, భారత కమ్యూనిస్టు ఉద్యమంలో రాజకీయ– సైద్ధాంతిక – నిర్మాణ పోరును సమిష్టిగాను, సమైక్యంగాను నిర్వహించగల్గారు. దేశంలో సిపిఐ(యం)కు పటిష్టమైన పునాదిని నిర్మించేందుకు వారు తమ అనుభవాన్ని వినియోగించారు.

## సి. పార్టీ కార్యక్రమం సారాంశము :

## ఐదు ప్రశ్నలు, సమాధానాలు.

**పార్టీ కార్యక్రమం సారాంశాన్ని క్రింది ఐదు ప్రశ్నలు, వాటి సమాధానాల నుండి గ్రహించవచ్చు.**

**1. భారత విప్లవ దశ ఏమిటి ?**

భారత విప్లవ దశ 'జనతా ప్రజాస్వామిక విప్లవం.' ఈ అంశాన్ని చారిత్రక

నేపథ్యంలో అర్థం చేసుకోవటం అవసరం. 1947 ఆగస్టు 15న భారత స్వాతంత్ర్యాన్ని సాధించటంతో, భారత విప్లవోద్యమంలో తొలి జాతీయ విముక్తి దశ ముగిసింది. ఈ మొదటి దశ అనేది, ప్రాథమికంగా సామ్రాజ్యవాద వ్యతిరేక, సార్వత్రిక ఐక్య వేదిక ఏర్పాటు. ఈ వేదికలో, బూర్జువాలు కూడా భాగస్వాములే.

ఇపుడు, రెండవ దశను పూర్తిచేసేందుకు రెండు కర్తవ్యాల అవసరముంది. ఒకటి. విదేశీయుల ఆస్తులు, ప్రధానంగా బ్రిటీష్, అమెరికావారి ఆస్తులను స్వాధీనం చేసుకొని, జాతీయం చేయటం. తద్వారా మన దేశంపై విదేశీ పెట్టుబడి పట్టును తొలగించాలి. రెండు. భూస్వామ్య విధానాన్ని, జమిందారీ విధానాన్ని పూర్తిగా రద్దుచేయటం. భూస్వాముల అధీనంలోని విస్తారమైన భూములను, మౌళికమైన భూ సంస్కరణల ద్వారా భూమిలేని వ్యవసాయ కార్మికులకు, పేద రైతులకు ఉచితంగా పునః పంపిణి జరపటం. ఆ చర్య, దేశ ప్రజల కొనుగోలు శక్తి గణనీయంగా పెరిగేందుకు దోహదపడుతుంది. ఫలితంగా, పారిశ్రామికరణ వేగవంతమౌతుంది. భారత ఆర్థిక వ్యవస్థ మొత్తమంతా పుంజుకుంటుంది.

గతంలో, భూస్వామ్య వ్యవస్థలకు వ్యతిరేకంగా ఇంగ్లండు, ఫ్రాన్స్ విప్లవాల్లో పునర్జీవనంపొందుతున్న బూర్జువాలు భయంకరమైన పోరాటాలు సాగించారు. 1649లో రాజు – మొదటి చార్లెస్, 1793లో రాజు – 16వ లూయీ. వారిరువురూ భూస్వామ్య వర్గాల ప్రతినిధులైనందునే ఆ పోరాటాలు, ఆ ఇద్దరి తలలు నరికేందుకు దారితీశాయి. ప్రత్యేకంగా ఫ్రాన్స్‌లో, భూస్వామ్య విధానం నాశనం చేయబడింది. వారి భూములను, మౌళికమైన భూసంస్కరణల ద్వారా రైతాంగానికి పంచబడ్డాయి. దీన్నే "బూర్జువా ప్రజాతంత్ర విప్లవం" అంటారు. (ఇక్కడ 'బూర్జువా' అంటే 'బూర్జువాల నాయకత్వంలో నడచిన' అని, ప్రజాతంత్ర, అంటే 'భూస్వామ్య వ్యతిరేక' అని, అర్థం.)

1947లో భారతదేశం స్వాతంత్ర్యం సాధించే నాటికి పరిస్థితులు గణనీయంగా మారాయి. ఒకటి. పెట్టుబడిదారీ విధానం పాతబడింది. దానికి, గత కాలపు శక్తి ఇంకేమాత్రమూ లేదు. రెండవ ప్రపంచ యుద్ధం కాలంలో, పెట్టుబడిదారీ విధానానికి పెద్ద ఎదురు దెబ్బ తగిలింది. మూడు. 1917లో గొప్ప అక్టోబరు విప్లవం, 1945లో జర్మన్ ఫాసిజంపె సోవియట్ యూనియన్ అద్భుత విజయం ప్రపంచ సోషలిస్టు శిబిరాన్ని సృష్టించాయి. నాలుగు. సామ్రాజ్యవాదం బలహీనపడటంతో, భారత్‌తో

సహా పలు వలస దేశాల్లో జాతీయ విముక్తి పోరాటాలు ఊపందుకున్నాయి. ఐదు. దేశ స్వాతంత్ర్యం నాటికి భారత బూర్జువావర్గం పెద్ద బలమైన, అభివృద్ధి చెందిన శక్తిగా లేదు.

ఆ పరిస్థితుల్లో, బ్రిటీష్ సామ్రాజ్యవాదం కాంగ్రెస్, ముస్లిం లీగ్‌లతో ఒక ఒప్పందం చేసుకుంది. ఆ రెండు పార్టీలు బూర్జువా, భూస్వామ్య వర్గాల ప్రయోజనాల పరిరక్షణకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. స్వాతంత్ర్యంతోపాటు, లక్షలాది ప్రజలు ఊచకోతలకు బలయ్యారు. బ్రిటీష్ పెట్టుబడి, భారత్ పాకిస్తాన్‌లలోని ద్రవ్య పెట్టుబడి ప్రయోజనాలను కాపాడటమే పై రాజీ సారాంశం. బ్రిటీష్ కామన్‌వెల్త్‌లో ఇరు దేశాలూ భాగస్వాములయ్యేందుకు అంగీకరించాయి.

స్వాతంత్ర్యానంతరం తొలి కొద్ది దశాబ్దాలలో, స్వావలంబన, సంతంత్ర ఆర్థికాభివృద్ధి, ప్రభుత్వ రంగం నిర్మాణానికి సోవియట్ యూనియన్ సహకారం, ప్లానింగ్‌లో పరిమిత ప్రయత్నాలు, అలీన విదేశాంగ విధానం వంటి కొన్ని సానుకూల అంశాలు చోటుచేసుకున్నాయి. కానీ, 1991లో సోవియట్ యూనియన్ పతనం, భారత్‌లో నయా – ఉదారవాద విధానాల ప్రారంభంతో పై సానుకూల అంశాలన్నీ ఎగిరిపోయాయి. అన్నిరంగాల్లోనూ సామ్రాజ్యవాదము, విదేశీ ద్రవ్య పెట్టుబడులతో పెరుగుతున్న మిలాఖత్ నేటి నియమంగా మారింది.

అదే సమయంలో జరిగిన పరిణామాల్లో, కొన్ని శతాబ్దాల క్రితం యూరపు బూర్జువా వర్గాల వైఖరులకు భిన్నంగా, భారత బూర్జువావర్గం భూస్వాములతో ఘర్షణపడేందుకు తిరస్కరించింది. ఇక్కడ బడా బూర్జువాలు, భూస్వాములతో లాలూచిపడి ఒక కూటమిగా ఏర్పడ్డారు. వారిని రాజ్యాధికారంలో భాగస్వాములుగా కలుపుకున్నారు. ఫలితంగా మౌళిక భూ సంస్కరణలు, భూమి పునఃపంపిణీ అంశాలు తిరస్కరించబడ్డాయి. అది పారిశ్రామీకరణ, భవిష్యత్ ఆర్థికాభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. అంతేకాదు, ఈ పరిస్థితి భూస్వామ్య విధానంతో సన్నిహిత సంబంధాలున్న మతోన్మాద శక్తులను, కులపరమైన అణచివేతలను, పితృస్వామ్యాన్ని కూడా ప్రోత్సహిస్తున్నది. అలాంటి శక్తులతో రాజ్యం రాజీపడుతున్నది. ఒకనాడు కాంగ్రెస్ – బ్రాండు లౌకికవాదాన్ని ఎత్తిపట్టిన భారత బడా బూర్జువా వర్గంలోని ఒక సెక్షన్, తమ స్వప్రమోజనాల కోసం నేడు బిజెపి బ్రాండు మతోన్మాదానికి మద్దతునిస్తున్నది.

**సారాంశంగా చెప్పాలంటే :** సామ్రాజ్యవాదము, భూస్వామ్య విధానంపై తలపడేందుకు బడా బూర్జువాలు ముందుకురారని, ప్రజాతంత్ర విప్లవ కర్తవ్యాలను

కూడా పూర్తిచేయలేరని కూడా మన పార్టీ కార్యక్రమం సరైన నిర్ధారణ చేసింది. ఆ కర్తవ్యాలను కర్షక వర్గంతో కలసిన కార్మికవర్గ నాయకత్వమే పూర్తిచేయవలసి ఉంది. అందుకే ప్రస్తుత భారత విప్లవాన్ని, 'జనతా ప్రజాస్వామిక విప్లవం'గా మనం పిలుస్తున్నాము. అది, బూర్జువా ప్రజాతంత్ర విప్లవానికి పూర్తిగా వ్యతిరేకమైనది. భూస్వామ్య వ్యవస్థను కూల్చేయటం, రాడికల్ భూ సంస్కరణలు చేపట్టడం, భూమిని పునఃపంపిణీ చేయటం వంటి చర్యలపై ఆధారపడటమే జనతా ప్రజాతంత్ర విప్లవానికి 'ఇరుసు'గా పనిచేస్తుంది.

**ఒక ప్రశ్న మిగిలివుంది. అది :** సోషలిస్టు విప్లవం కోసం నేరుగా మనం పిలుపు ఇవ్వలేదెందుకు? అందుకు ప్రధాన కారణం, మన దేశంలో నెలకొన్న వస్తుగత పరిస్థితులతోపాటు, ఆ స్థాయికి ప్రజల చైతన్య స్థాయి ఇప్పటికింకా పెరగకపోవటం. సోషలిజం నిర్వచనాన్ని పైన పొందుపరిచాం. సోషలిజాన్ని రష్యా, చైనా, ఇతర సోషలిస్టు దేశాల్లోవలే దశలవారీ సాధించాలి. భారతదేశంలో, జనతా ప్రజాస్వామిక విప్లవమే సోషలిస్టు విప్లవానికి మార్గం చూపుతుందని మనం బలంగా నమ్ముతున్నాం.

## 2. భారతదేశంలో రాజ్యాధికారంపై పట్టున్న వర్గాలేవి?

ఈ ప్రశ్న, దాని సమాధానం సారాంశమే మన పార్టీ కార్యక్రమం. సరిగ్గా ఈ సమస్యపైనే, భారత కమ్యూనిస్టు ఉద్యమంలో తీవ్రమైన రాజకీయ, సైద్ధాంతిక పోరాటం నడిచింది. ఈ అంశమే కమ్యూనిస్టు ఉద్యమంలో రెండు చీలికలకు దారితీసింది. ఈ ప్రశ్నకు సమాధానం మన పార్టీ కార్యక్రమంలో క్లుప్తంగా ఇలా పొందుపర్చబడింది : "వర్తమాన భారత రాజ్యం, బడా బూర్జువాల నాయకత్వంలోని బూర్జువా, భూస్వాముల వర్గపాలన. ఆ బడా బూర్జువాలు, 'పెట్టుబడిదారీ అభివృద్ధి పథం' ముసుగులో విదేశీ ద్రవ్య పెట్టుబడితో మిలాఖత్ అవటం నానాట పెరుగుతున్నది. ఈ వర్గ స్వభావమే, దేశ జీవితంలో రాజ్యం పాత్ర, పనిని ప్రధానంగా నిర్ణయిస్తుంది." (పేరా 5.1)

మన పార్టీ కార్యక్రమం ఈ విధమైన నిర్ధారణకు వచ్చేందుకు మూలమైన కారణాలు, కార్యక్రమం 3వ సెక్షన్ – "స్వాతంత్ర్యము మరియు అనంతరము" శీర్షికలో వివరంగా విశ్లేషించబడ్డాయి. స్వాతంత్ర్యానంతర దశాబ్దాల్లో ఈ పాలక వర్గాలే శ్రామిక జనుల ప్రయోజనాలను పణంగా పెట్టాయన్నది ఇక్కడ ముఖ్యమైన అంశం. బడా బూర్జువాలు, భూస్వాములే గరిష్ట స్థాయిలో సంపదలను పోగేసుకున్నారు. అందుకు ప్రధాన కారణం, రాజ్యాధికారం వారి చేతుల్లో ఉండటమే. కేంద్ర ప్రభుత్వము,

దాదాపు అన్ని రాష్ట్ర ప్రభుత్వాల విధాన నిర్ణయాలను వారు నియంత్రించారు. వామపక్ష నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రమే అందుకు మినహాయింపుగా నిలుస్తున్నాయి.

1991లో కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వం సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ (యల్‌పిజి)లతో కూడిన నయా – ఉదారవాద విధానాలకు తెరలేపింది. అనంతరం వచ్చిన కేంద్ర ప్రభుత్వాలు కూడా ఆ విధానాలను ముందుకు తీసుకెళ్లాయి. దానితో పరిస్థితి మరింత దిగజారింది. 2014 తర్వాత కేంద్రంలో అధికారం చేపట్టిన బిజెపి ప్రభుత్వం ఆ విధానాలను విపరీతమైన వేగంతో అమలుచేస్తున్నది. గత మూడు దశాబ్దాల్లో, విదేశీ ద్రవ్య పెట్టుబడితో మిలాఖత్ కావటమనేది పెరుగుతున్నట్లు స్పష్టమౌతున్నది. దేశ ఆర్థిక విధానాల రూపకల్పనలో, అంతర్జాతీయ సామ్రాజ్యవాదుల ఆధిపత్యంలోని ప్రపంచబ్యాంకు, ఐయంయఫ్, డబ్ల్యుటిఒ, పలు బహుళజాతి సంస్థలకు మరింతగా లొంగిపోతున్నది. ఇటీవలి కాలంలో భారత రక్షణ, భద్రత, విదేశాంగ విధానాలన్నీ అమెరికన్ సామ్రాజ్యవాదపు కనుసన్నల్లోనే నడుస్తున్నాయి. అందుకు ఇటీవలి కొన్ని ఉదాహరణలు : భారత ప్రభుత్వం, కష్టకాలంలో పాలస్థీనాను నీట ముంచి, ఇజ్రాయిల్‌ను సంతోషపెట్టడం. అమెరికా నాయకత్వంలోని క్వాడ్, 12యు2 దేశాల గ్రూపుల్లో భారత్ సభ్యత్వం వంటి అంశాలు.

భారత్ బడా బూర్జువా వర్గపు ద్వంద్వ స్వభావం గురించి కూడా పార్టీ కార్యక్రమం ఎత్తిచూపుతున్నది. సాధారణంగా అది సామ్రాజ్యవాదంతో మిలాఖత్ అవుతుంటుంది. కానీ అది, కొన్ని సమస్యలపై సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తుంది కూడా. అందుకు కొన్ని ఉదాహరణలు : ఆది నుండి, జమ్ము కాశ్మీర్ భారత్‌లో అంతర్భాగమేనంటున్న కేంద్ర ప్రభుత్వ వైఖరి. పాక్‌తో యుద్ధం, 1971లో బంగ్లాదేశ్ ఏర్పాటుకు దారితీసింది. భారత్, షాంఘై కో–ఆపరేషన్ ఆర్గనైజేషన్‌లో ఒక సభ్యురాలిగా చేరటం వగైరా.

దేశపు అంతర్గత విధానాల్లో, స్వదేశీ, విదేశీ బడా కార్పోరేట్లు భారీగా సంపదలను దండుకుంటున్నారు. వారి సంఖ్య కూడా విస్తారంగా పెరుగుతున్నది. గత 7 సంవత్సరాల్లో, రు.11లక్షల కోట్ల విలువైన కార్పోరేట్ల రుణాలు రద్దుచేశారు. వారికి, ప్రతి సంవత్సరం భారీగా పన్ను రాయితీలిచ్చారు. కార్మికవర్గాన్ని, కార్పోరేట్లకు

బానిసలుగా మార్చేందుకు నాలుగు  లేబరు కోడ్‌లను రూపొందించారు. దేశాన్ని కార్పోరేట్లకు కారుచౌకగా తెగనమ్మేందుకు 'నేషనల్ మోనిటైజేషన్ పైప్‌లైన్ (యన్‌యంపి)ను ప్రవేశపెట్టారు. సూక్ష్మంగా చెప్పాలంటే, ప్రభుత్వ రంగం భారీ ప్రైవేటీకరణకు రూపొందించిన పథకమది. పై తెల్పినవన్నీ, ప్రస్తుత బిజెపి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్షణాలు. అదే తరహాలో, మూడు వ్యవసాయ చట్టాల ద్వారా వ్యవసాయ రంగాన్ని కార్పోరేట్లకు కట్టబెట్టే యత్నం జరిగింది. కానీ దాన్ని, 2020-21లో జరిగిన సంవత్సర కాలపు చారిత్రక రైతాంగ సమైక్య పోరాటం వీరోచితంగా తిప్పికొట్టింది.

పై విధానాల అంతిమ ఫలితంగా, దేశ వ్యాపితంగా ఆందోళనకరమైన స్థాయిలో పేదరికం, ఆకలి, నిరుద్యోగం, ధరలు పెరిగాయి.  రైతాంగ ఆత్మహత్యలు, ఆకలి చావులు, కుదిపేసే నేరాలు వంటి అనేక రుగ్మతలు పెచ్చరిల్లాయి. దళితులు, ఆదివాసీలు, మహిళలు, మైనారిటీలు దారుణమైన సామాజిక అణచివేతలకు గురౌతున్నారు.

కానీ వేరొక వైపున, ఇటీవల గౌతమ్ అదానీ  ప్రపంచంలో రెండవ అతిపెద్ద సంపన్నుడిగా (హిడెన్‌బర్గ్ నివేదిక) వెలువడ్డాక  అతని స్థానం వేగంగా పడిపోయింది. ముఖేష్ అంబానీ ప్రపంచంలో ఐదవ సంపన్నుడిగా ఎదిగాడు. కోవిడ్ మహమ్మారి ఆవరించినప్పటికీ, అనేక మంది ఇతర స్వదేశీ, విదేశీ కార్పోరేట్లు గతంలో కనీవినీ ఎరుగని స్థాయిలో సంపదలను పోగేసుకున్నారు. ఆ వివరాలన్నీ,  ఇటీవలి ఆక్స్‌ఫాం అసమానతల నివేదిక వెల్లడించింది. అధికారంలోని ప్రభుత్వం చురుకైన విధానపరమైన అండదండలు లేకుండా, పై తెల్పినవన్నీ జరగవన్నది స్పష్టం. అందుకు బదులు తీర్చుకునేందుకు, ఈ కార్పోరేట్లే  తమ బ్రహ్మాండమైన ధనము, మీడియా శక్తితో అధికార బిజెపికి ఎన్నికల్లో ఉదారంగా సాయపడ్డారు.

గ్రామీణ రంగానికి సంబంధించినంత వరకు, భూస్వామ్య బృందాల భూ కేంద్రీకరణ మరింతగా పెరిగింది. అదే సమయంలో, భూమిలేని పేదల సంఖ్య కూడా స్పష్టంగా పెరిగింది. గనుల తవ్వకాలు, పరిశ్రమలతోపాటు,  రియల్ ఎస్టేట్ కోసం కూడా, బలవంతపు భూ ఆక్రమణలకు పెద్ద కార్పోరేట్లు బరిలోకి దిగారు. భూస్వాముల బృందాలు పంచదార మిల్లులు, విద్యా సంస్థలు, పెట్రోల్ పంపులు,

వ్యవసాయ ఉత్పాదకాలు (ఇన్‌పుట్స్), అమ్మకం కేంద్రాలు వంటి పలు భిన్నమైన గ్రామీణ రంగాల వైపు మళ్లాయి. వారే, ఎక్కువ భాగం గ్రామీణ రాజకీయ అధికారాన్ని అదుపుచేస్తున్నారు.

పై సమాచారాలు, పేరా 5.1 కచ్చితత్వాన్ని స్పష్టంగా రుజువు చేస్తున్నాయి. ఈ సూత్రీకరణ, 1964 పార్టీ కార్యక్రమం మూలంలోనే ఉందని నొక్కిచెప్పాలి. 2000లో పార్టీ కార్యక్రమం తాజా పరచినపుడు దానిలో ఒక్క పదాన్ని కూడా మార్చ లేదు.

**ఈ కీలకమైన ప్రశ్నకు అప్పుడు సిపిఐ, నక్సలైట్లు ఇచ్చిన సమాధానం ఏమిటి?**

**సిపిఐ వైఖరి :**

కీలకమైన ఈ ప్రశ్నకు సిపిఐ సమాధానం ఇలా ఉంది : 1. భారత రాజ్యం జాతీయ బూర్జువావర్గం చేతుల్లో ఉంది. (జాతీయ బూర్జువావర్గం అంటే, ప్రధానంగా సామ్రాజ్యవాద విదేశీ పెట్టుబడితో సంబంధంలేని చిన్న బూర్జువాలు) 2. బడా బూర్జువాలు రాజ్యంపై వత్తిడి చేయగలరు. (వారు రాజ్యాన్ని నడపడం లేదు. రాజ్యాధికార శక్తిపై పట్టు కూడా లేదు.) 3. జాతీయ బూర్జువాలు, భూస్వాములతో కొన్ని రాజీలుపడతారు. భూస్వాములను రాష్ట్రాల మంత్రి వర్గాల్లోకి తీసుకుంటారు. వారికి కొన్ని రాయితీలిస్తారు. (కానీ, భూస్వామ్య వర్గానికి రాజ్యాధికారం ఉండదు. చివరికి అది రాజ్యాధికారంలో భాగస్వామిగా కూడా ఉండదు.)

పై అంచనాలు ఆధారంగా సిపిఐ ఇలా నిర్ధారించింది : భారతదేశ విప్లవం జాతీయ ప్రజాతంత్ర విప్లవం. జాతీయ బూర్జువా వర్గము, కార్మిక వర్గము సంయుక్తంగా ఆ విప్లవానికి నాయకత్వం వహిస్తాయి. సిపిఐ(యం), సిపిఐ రెండు పార్టీల కార్యక్రమాల మధ్య తేడాలను బిటి రణదివే తన గ్రంథం "టు ప్రోగ్రామ్స్– మార్క్సిస్టు అండ్ రివిజనిస్ట్"లో ఒక వాక్యంలో ఇలా స్పష్టంగా విశ్లేషించారు – "మొదటిది వర్గ పోరాటం ప్రాతిపదికపై రూపొందించబడగా, రెండవది వర్గ సామరస్యంపైన ఆధారపడి రూపొందించబడింది."

రెండు కార్యక్రమాల మధ్య తేడా కేవలం పదాలు, అర్థాలకు సంబంధించిన ప్రశ్న కాదు. యస్‌ఎ డాంగే తదితరుల నాయకత్వంలో, సిపిఐ కార్యక్రమం సంబంధిత అవగాహన అనేక పొరపాటు రాజకీయ నిర్ణయాలకు దారితీసింది. 1967లో సిపిఐ

నాయకులు కొన్ని ఉత్తరాది కాంగ్రెసేతర రాష్ట్ర ప్రభుత్వాల్లో భాగస్వాములయ్యారు. ఆ ప్రభుత్వాల్లో జనసంఘ్ (ఆర్‌యస్‌యస్ రాజకీయ విభాగం), స్వతంత్రపార్టీ (పెట్టుబడిదారులపట్ల బహిరంగ సానుకూలతగలది) మంత్రులు కూడా ఉన్నారు. వేరొక వైపున దక్షిణాది రాష్ట్రం కేరళలో సిపిఐ మొదట ఒక ప్రభుత్వంలో చేరింది. తర్వాత కాలంలో అతి పెద్ద పార్టీ కాంగ్రెస్‌తో కలసి రాష్ట్ర ప్రభుత్వానికే నాయకత్వం వహించింది. ఇదంతా చేసింది, సిపిఐ(యం)ను ఒంటరిచేసే లక్ష్యంతో మాత్రమే.

1975-77 మధ్య కాలంలో ఇందిరా గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వం దేశంలో అత్యవసర పరిస్థితిని విధించింది. ఆ అత్యవసర పరిస్థితిని సిపిఐ బహిరంగంగా బలపరచటం అన్నింటికంటే చెడ్డ ఉదాహరణ. కేవలం సిపిఐ, జనసంఘ్ ఈ రెండు పార్టీలే అత్యవసర పరిస్థితిని బలపరిచాయి. అనేక మంది సిపిఐ(యం) నాయకులతో సహా మిగిలిన ప్రతిపక్ష పార్టీల నాయకులందరినీ జైళ్లలో తోశారు. పశ్చిమ బెంగాల్(1977)లో, జ్యోతిబసు నాయకత్వంలో మొదటి వామపక్ష ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడింది. ఆ ప్రభుత్వంలో సిపిఐ భాగస్వామి కాకపోగా, కాంగ్రెస్ కూటమితో కలసి ఎన్నికల్లో పాల్గొన్నది. 1982లో కేవలం వామపక్ష సంఘటనలో చేర్చుకున్నాక మాత్రమే, సిపిఐ తన విధానాలను మార్చుకుని ఆ ప్రభుత్వంలో చేరింది.

## నక్సలైట్ల వైఖరి

నక్సలైట్లకు సంబంధించినంత వరకు, 1967-68లో చారుముజుందార్, తరిమెల నాగిరెడ్డివంటి నాయకులు సిపిఐ(యం) నుండి బైటకు వెళ్లారు. సిపిఐ(యంయల్) పేర ఒక పార్టీని ప్రారంభించారు. ఉత్తర బెంగాల్‌లోని 'నక్సల్‌బరీ' గ్రామంలో తొలి తిరుగుబాటు జరిగింది. అందుకే వారిని నక్సలైట్లని అంటారు. తర్వాత కాలంలో సిపిఐ(యంయల్) అనేక భిన్నమైన ముఠాలుగా చీలిపోయింది.

సిపిఐ(యంయల్) కార్యక్రమం మూల విధానం ప్రకారం, భారతదేశ రాజ్యం దళారీ (కాంప్రడార్) పెట్టుబడిదారులు, భూస్వాముల చేతుల్లో ఉంది. (దళారీ అంటే, కేవలం సామ్రాజ్యవాదుల ఏజంట్లు మాత్రమే.) ఆ విధంగా ఇప్పటికీ దేశాన్ని వాస్తవంగా పాలిస్తున్నది సామ్రాజ్యవాదులేనని, కానీ వారు వెనుక సీటు నుండి పాలన చేస్తున్నారని వారు చెబుతారు. భారత పాలక వర్గాలు కేవలం సామ్రాజ్యవాదుల ఏజంట్లు అయినందున, ప్రజల్లో వారు వేరూనుకోలేదన్నది వారి అభిప్రాయం. అందుకే ఒక సాయుధ తిరుగుబాటును ప్రారంభిస్తే రాజ్యం పేక మేడలా కుప్పకూలిపోతుందని, భారత విప్లవం త్వరలో వాస్తవ రూపం తీసుకుంటుందన్నది వారి అంచనా. "ఒక

అగ్ని కణం విశాలమైన పచ్చిక బైళ్లలో కార్చిచ్చును రగిలిస్తుంది.” – అది చైనా పాత సామెత.

ఈ అంచనా, వాస్తవాన్నుండి దూరమైతే ప్రమాదకరమైన ఫలితాలకు దారితీయటం ఖాయం. నక్సలైట్లు సాయుధ దళాలను ఏర్పరచి భూస్వాములు, కొన్ని ప్రాంతాల్లో పోలీసుల ఖతం కార్యక్రమం ప్రారంభించారు. ఎన్నికలను బహిష్కరించారు. ప్రభుత్వం, నక్సలైట్లపై భయంకరంగా విరుచుకుపడింది. వందల మందిని చంపేసింది. నక్సలైట్లను అరికట్టడమన్న సాకుతో, అన్ని ఇతర కమ్యూనిస్టు గ్రూపులకు వ్యతిరేకంగా నిర్బంధాన్ని ప్రయోగించింది. చివరకు, దేశంలోని కొన్ని అటవీ ప్రాంతాలకే నక్సలైట్లు పరిమితమైనారు. ఇక్కడ కూడా వారిలో కొందరు కంపెనీలు, కాంట్రాక్టర్ల నుండి బలవంతపు వసూళ్లకు పూనుకున్నారు. ఎన్నికల సమయంలో బూర్జువా పార్టీలతో ఆర్థికపరమైన ఒప్పందాలు చేసుకున్నారు.

నక్సలైట్లు, మావోయిస్టు గ్రూపుల ఒక ఉమ్మడి లక్షణం, సిపిఐ(యం)ను ఒక శతృవుగా ఎంచుకోవటం. 1972–77 మధ్య పశ్చిమ బెంగాల్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం, సిపిఐ(యం)పై అర్ధ ఫాసిస్టు దమనకాండను సాగించింది. నక్సలైట్లు, ఆ దమనకాండలో ప్రభుత్వానికి సహకరించారు. కొందరు చురుకైన సిపిఐ(యం) కార్యకర్తలను చంపేశారు. 30 సంవత్సరాల అనంతరం 2008లో, సాల్‌బొనీలో మావోయిస్టులు ఒక మందు పాతరను పేల్చేశారు. నాటి పశ్చిమ బెంగాల్ ముఖ్య మంత్రి బుద్ధదేవ్ భట్టాచార్యను, కేంద్ర మంత్రులు రామవిలాస్ పాశ్వాన్, జతీన్ ప్రసాదాలను చంపేందుకు వారు చేసిన ఆ ప్రయత్నం తృటిలో తప్పింది. ఆ తర్వాత సిపిఐ(మావోయిస్టు) పోలిట్‌బ్యూరో సభ్యుడు కిషన్‌జీ పలు మార్లు ఇలా ప్రకటించాడు: “పశ్చిమ బెంగాల్లో సిపి(యం) ఓటమిని, మమతా బెనర్జి నాయకత్వంలోని టియంసి విజయాన్ని మేము స్వాగతిస్తున్నాము.” 2011లో, ఈ ప్రకటన వెలువడిన ఆరు నెల్లలోపే టియంసి ప్రభుత్వం, ఒక ఎన్‌కౌంటర్‌లో కిషన్‌జీని చంపేసింది.

2004లో, మావోయిస్టు కో–ఆర్డినేషన్ సెంటర్ ఆఫ్ ఇండియా (యంసిసి), పీపుల్స్ వార్ గ్రూపు (పిడబ్లియుజి)లు కలసి సిపిఐ (మావోయిస్టు)గా ఏర్పడ్డాయి. అది అప్పటి నుండి, అనేక హింసాత్మక దాడులకు పాల్పడుతున్నది. అది ఒక నిషేధిత సంస్థ. మరి కొన్ని నక్సలైట్ గ్రూపులు ప్రధాన స్రవంతిలో చేరాయి. హింసను విడనాడి, ఎన్నికల్లో పాల్గొంటున్నాయి. వాటిలో, సిపిఐ (యంయల్ – లిబరేషన్) ముఖ్యమైనది. ఇపుడు ఆ పార్టీకి, ఒక రాష్ట్రం బీహారులో 12మంది శాసన సభ్యులున్నారు.

## 3. భారత విప్లవ పోరాటంలో వర్గ శతృవులు ఎవరు?

పై అవగాహన, భారతదేశంలో రాజ్యాధికారాన్ని అధీనం చేసుకున్న వర్గాలు గురించి తెల్పుతున్నది. జనతా ప్రజాస్వామిక విప్లవ విజయానికి, ముగ్గురు వర్గ శతృవులను ఓడించాలని పార్టీ కార్యక్రమం స్పష్టంగా నిర్దేశించింది. ఆ వర్గ శతృవులు: 1. బడా బూర్జువాలు, 2. భూస్వాములు, 3. సామ్రాజ్యవాదులు.

భారతదేశంలో, రాజ్యానికి బడా బూర్జువాలు నాయకత్వం వహిస్తున్నారు. స్వాతంత్ర్యానంతరం వారు సంపదలను పోగేసుకుని బాగా పుంజుకున్నారు. అన్ని తరగతుల ప్రజానీకాన్నీ అత్యధికంగా దోపిడీ చేయటం ద్వారానే వారు ఆ స్థితికి ఎదిగారు. వీరు, ఏ ఇతర వర్గాల కంటే, అధికార మీటల (లివర్స్)ను ఎక్కువ అదుపుచేస్తూ, ప్రభుత్వ విధానాలను నిర్దేశించగల్గుతున్నారు.

శ్రామిక ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకంగా, తమ స్వంత ప్రయోజనాలను కాపాడుకునేందుకు, బడా బూర్జువా వర్గం భూస్వాములతో కలసి బలమైన కూటమిగా ఏర్పడ్డారు. భూస్వామ్య విధానానికి వ్యతిరేక పోరాటంలో రెండు అంశాలున్నాయి. అవి, ఒకటి. పెరుగుతున్న భూ కేంద్రీకరణకు వ్యతిరేక పోరాటం. రాడికల్ భూ సంస్కరణల ద్వారా భూమిని పునఃపంపిణీని చేపట్టడం. రెండు. భూస్వామ్య వ్యవస్థతో సంబంధమున్న మతోన్మాదానికి, కుల వ్యవస్థకు, కుల అణచివేతలకు, పితృస్వామ్యానికి వ్యతిరేక పోరాటం. విదేశీ ద్రవ్య పెట్టుబడితో అంటే సామ్రాజ్యవాదంతో, మిలాఖత్ కావటం ద్వారా బడా బూర్జువాలు ఎదుగుతున్నారు. గతంలో మనం గమనించినట్లు ప్రపంచవ్యాపితంగా సామ్రాజ్యవాదమే విప్లవానికి, సోషలిజానికి ప్రధాన శత్రువు. అది, భారత ప్రజానీకాన్ని పలు రూపాల్లో దోపిడీచేస్తున్న తీరు గర్హనీయం.

పై తెల్పిన మూడు వర్గాలూ ఒక జట్టుగా ఏర్పడి, పరస్పరం సమకరించుకుంటున్నాయి. అందుకే, జనతా ప్రజాస్వామిక విప్లవం జయప్రదం కావాలంటే ఈ మూడు వర్గాల కూటమిని ఓడించితీరాలి. భారత విప్లవానికి ఈ మూడూ శతృ వర్గాలే. ఈ మూడు శతృ వర్గాల రాజకీయ ప్రతినిధులకు వ్యతిరేకంగానే, రోజువారీ రాజకీయాల్లో మన పోరాటం ఎక్కుపెట్టబడుతున్నది. ఈ వర్గ శతృవుల కూటమిలోని బిజెపి, కాంగ్రెస్‌లు రెండూ, పాలక వర్గాల అఖిల భారత ప్రతినిధులే. అందుకే, మన పోరాటం ఆ కూటమికి వ్యతిరేకంగానే ఎక్కుపెట్టబడి ఉండటం సహజం. కాంగ్రెస్ ఇప్పటికీ ఒక పెద్ద బూర్జువా – భూస్వామ్య పార్టీగానే ఉన్నది. ప్రాంతీయ పార్టీలు, సాధారణంగా ఆయా ప్రాంతాల బూర్జువా, భూస్వామ్య వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. కానీ బిజెపి, గత 30 సంవత్సరాల్లో భారత పాలక వర్గాల ప్రధాన రాజకీయ పార్టీగా ఆవిర్భవించింది.

**బిజెపి గురించి పార్టీ కార్యక్రమం ఇలా విశ్లేషించింది :**

"స్వాతంత్ర్యానంతరం కూడా, అభివృద్ధి నిరోధక విప్లవ ప్రతీఘాత ధోరణులు ఉనికిలో ఉన్నాయి. ఫ్యూడల్ భావజాలానికిగల అపూర్వమైన ప్రభావం ప్రాతిపదికన ప్రజల వెనుకబాటుతనాన్ని వారు వినియోగించుకుంటారు. ఇటీవలి దశాబ్దాలలో కాంగ్రెస్‌పై పెరిగిన అసంతృప్తిని, అది క్రమంగా క్షీణించటాన్నివారు ఉపయోగించుకుంటారు. కాంగ్రెస్ వదలిన ఖాళీని తాము భర్తీచేసేందుకు తీవ్రమైన ప్రయత్నాలు ప్రారంభించారు. బిజెపి విచ్ఛిన్నకర మతోన్మాద కార్యక్రమంగల ఒక అభివృద్ధి నిరోధక పార్టీ. ఇతర మతాలపట్ల ద్వేషం, అసహనం, పచ్చి జాతీయ దురభిమానం దాని అభివృద్ధి నిరోధక సారానికి ప్రాతిపదిక. బిజెపి, ఫాసిస్టు తరహా ఆర్‌యస్‌యస్ మార్గదర్శకత్వంలో, ప్రాబల్యంలో పనిచేస్తున్నది. అందుకే, బిజెపి ఒక సాధారణ బూర్జువా రాజకీయ పార్టీ కాదు. బిజెపి అధికారంలో ఉంటే రాజ్యాధికారాన్ని, రాజ్యాంగ యంత్రాలను ఫాసిస్టు ఆర్‌యస్‌యస్ నిర్దేశిస్తుంది. ఆధిపత్యం వహిస్తుంది. హిందుత్వ సిద్ధాంతం, హిందూ రాజ్య స్థాపన లక్ష్యంతో అది, పునరుద్ధరణవాదాన్ని (రివైవలిజం) పెంపొందిస్తుంది. భారత దేశపు మిశ్రమ సంస్కృతిని తోసిపుచ్చుతుంది. ఈ విధమైన మతతత్వధోరణి వ్యాప్తిచెందటంవల్ల మైనారిటీ మత ఛాందసవాదం కూడా పెరుగుతుంది. రాజకీయ వ్యవస్థ లౌకిక పునాదిపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుంది. వామపక్ష ప్రజాతంత్ర ఉద్యమానికి తీవ్ర ప్రమాదం తెచ్చిపెడుతుంది. బడా వాణిజ్య వర్గాలు, భూస్వామ్య వర్గాల్లో గణనీయమైన భాగం మాత్రమేగాక, అమెరికా నాయకత్వంలోని సామ్రాజ్యవాదం కూడా బిజెపికి అన్ని విధాలా మద్దతునిస్తున్నది." (పేరా 7.14)

## 4. భారత విప్లవ పోరాటంలో మన వర్గ మిత్రులు ఎవరు?

ఈ ముగ్గురు వర్గ శత్రువులను ఓడించేందుకు ఉద్దేశించిన మన వర్గ మిత్రుల సంఘటన గురించి పార్టీ కార్యక్రమం 7వ సెక్షన్‌లో "జనతా ప్రజాస్వామిక సంఘటన నిర్మాణం" శీర్షికతో వివరంగా చర్చించబడింది. జనతా ప్రజాస్వామిక సంఘటనకు కార్మిక వర్గం నాయకత్వం వహిస్తుంది. ఎందుకంటే – చారిత్రకంగా కార్మిక వర్గం అత్యంత అభివృద్ధికరమైన వర్గం. అత్యంత సంఘటితమైన వర్గం. సహజంగానే ఉత్పత్తి సాధనాలపై ప్రైవేటు యాజమాన్యాన్ని వ్యతిరేకించే వర్గం. కోట్లాది అసంఘటిత

రంగం కార్మికులపై క్రూరంగా దాడి జరుగుతున్నది. నాలుగు లేబరు కోడ్‌లు సంఘటిత కార్మికులపై ఎక్కుపెట్టబడ్డాయి. సంఘం పెట్టుకునే హక్కు, పర్మినెంట్ ఉద్యోగాలు, నిజ వేతనాలు, సామాజిక న్యాయం, ఎనిమిది గంటల పని దినం వంటి హక్కులన్నింటిపైనా నేడు దాడి జరుగుతున్నది. భారీ స్థాయి తొలగింపులు (రిట్రెంచ్‌మెంట్స్), కాంట్రాక్టు, క్యాజువల్, తాత్కాలిక ఉద్యోగ వ్యవస్థలు నియమాలు (రూల్స్)గా మారాయి.

వ్యవసాయ కార్మికులు, పేద రైతులు ఇరువురూ – కార్మిక వర్గపు సన్నిహిత మిత్రులు. పట్టణ శ్రామికులు కార్మిక వర్గంగా ఎలా రూపొందారో, గ్రామీణ శ్రామికుల నుండే ఈ రెండు వర్గాలూ రూపొందాయి. వ్యవసాయ కార్మికులు ఉపాధి పథకంపై తీవ్రమైన దాడిని ఎదుర్కొంటున్నారు. భూమి, ఇంటి స్థలాలు, రేషన్, వేతనాలు, పెన్షన్‌వంటి వారి సమస్యలు మరింత ప్రమాదంలో పడుతున్నాయి. పేద రైతులు అసంఖ్యాకమైన సమస్యలను ఎదుర్కొంటున్నారు. వారు భూమిలేమితో, నీడలేని కటిక దారిద్ర్యం అంచులకు నెట్టబడుతున్నారు. పై మూడు వర్గాల కంటే దళితులు, ఆదివాసీలు, మహిళలు, మైనారిటీలు ఘోరంగా దెబ్బతింటున్నారు. జనాభాలో 70 శాతంగా ఈ మూడు వర్గాలవారే ఉన్నారు. ఈ మూడు వర్గాల ఐక్యతనే "కార్మిక – కర్షక ఐక్యత" అంటాం. అది, జనతా ప్రజాతంత్ర సంఘటనకు వెన్నెముకవంటిది.

జనతా ప్రజాతంత్ర సంఘటనలో మధ్య తరగతి రైతులు నమ్మకమైన మిత్రులు. వందలు వేలాది మధ్య తరగతి రైతాంగం అప్పులపాలై అనివార్యమైన పరిస్థితుల్లో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. గిట్టుబాటుధరలు లేకపోవటం, వ్యవసాయ ఉత్పాదకాల ధరలు విపరీతంగా పెరగటం, బోగస్ పంట ఇన్సూరెన్స్ పథకాలు, విద్యుత్ నీటిపారుదల రేట్లు భారీగా పెరగటం, ప్రభుత్వం అవలంబిస్తున్న కార్పోరేట్ అనుకూల వ్యవసాయ విధానాలు వంటి తీవ్రమైన సమస్యలను, పేద రైతులతోపాటు మధ్యతరగతి రైతాంగం కూడా ఎదుర్కొంటున్నారు. "ధనిక రైతులు ఊగిసలాడే భాగస్వాములుగా ఉన్నప్పటికీ, కొన్ని పరిస్థితుల్లో వారిని కూడా జనతా ప్రజాతంత్ర విప్లవ సంఘటనలోకి తీసుకురావచ్చు. వారు, జనతా ప్రజాతంత్ర విప్లవంలో తమ పాత్రను నిర్వహించవచ్చు. మూడు వ్యవసాయ చట్టాల ఉపసంహరణకు సంవత్సరం పాటు జరగిన పోరాటంలో అత్యధికులు పేద, మధ్య తరగతి రైతాంగమైనప్పటికీ, ధనిక రైతుల్లోని కొన్ని సెక్షన్‌లు కూడా పాల్గొన్నాయి. కార్పోరేట్లకు అనుకూలమైన ప్రభుత్వ విధానాలపట్ల అసమ్మతి పెరుగుతున్నది.

పట్టణ మధ్యతరగతి, ముఖ్యంగా దిగువ మధ్యతరగతి, "జనతా ప్రజా తంత్ర విప్లవ సంఘటనలో మిత్రులుగా ఉండగలరు. ఉండాలి. విప్లవం కోసం, వారి విశ్వాసాన్ని గెల్చుకునేందుకు అన్ని ప్రయత్నాలూ చేయాలి." (పేరా7.9) ఈ తరగతి, ప్రైవేటీకరణలు వాటి ఫలితంగా సాగుతున్న ఉద్వాసనలకు గురౌతున్నది. విద్య, ఉపాధి, గృహ వసతిపై ప్రభుత్వ సంకుచిత విధానాల దాడులను ఎదుర్కొంటున్నది.

గుత్తేరమైన, బడాయేతర బూర్జువా వర్గం ఒక అస్థిరమైన మిత్రులుగా ఉండవచ్చు. వారు, "బడా బూర్జువాలు, విదేశీ బహుళజాతి సంస్థల నుండి పలు రూపాలలో, అసమానమైన పోటీని ఎదుర్కొంటున్నారు. ... ఈ ద్వంద స్వభావం మూలంగా ఒక అస్థిరమైన మిత్రునిగా కూడా, వారు విప్లవంలో పాల్గొనటమనేది వర్గశక్తుల బలాబలాల్లో వచ్చే పలు నిర్దిష్ట పరిస్థితులపైన; సామ్రాజ్యవాదం, భూస్వామ్య విధానం, ప్రజలకు మధ్య నెలకొన్న వైరుధ్యపు తీవ్రతపైన; బడా బూర్జువాల నాయకత్వంలోని రాజ్యానికి, ఇతర బూర్జువా విభాగాలకు మధ్యగల వైరుధ్యపు లోతులను బట్టి ఆధారపడి ఉంటుంది." (పేరా 7.11) చిన్న పెట్టుబడిదారులు, చిరు వ్యాపారులు జియస్‌టి దాడిని, బలమైన ప్రభుత్వ విధానాల మద్దతుగల బడా పెట్టుబడిదారుల పోటీని తట్టుకోలేక, తమ పరిశ్రమలు, దుకాణాలు మూసివేతల సమస్యను వారు ఎదుర్కొంటున్నారు. ఈ వర్గాలంటినీ మనం చేరుకోవలసిన అవసరముంది.

పై తరగతులన్నీ ధరల పెరుగుదల, నిరుద్యోగం, విద్య వైద్యాలను ప్రైవేటీకరణలతోను, కోవిడ్ అనంతర మాంద్యంతో ఇబ్బందిపడుతున్నాయి.

పై ఏడు వర్గాలకు చెందిన వర్గ మిత్రుల పొత్తుతో, జనతా ప్రజాతంత్ర సంఘటన (పిడియఫ్) రూపొందుతుంది. దాన్ని, ఒక వర్గ కూటమిగా మనం గుర్తుంచుకోవాలి. దాన్ని, బ్రహ్మాండమైన వర్గ– ప్రజా పోరాటాలు చేపట్టడం; ప్రజలకు రాజకీయ, సైద్ధాంతిక విద్యనందించటం; విశాలమైన వర్గ, ప్రజా సంఘాలతోపాటు బలమైన కమ్యూనిస్టు పార్టీని నిర్మించటం ద్వారా మాత్రమే సాధించగలం. రాజకీయంగా, మనం ఊహిస్తున్న వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (యల్‌డియఫ్) అనేది, జనతా ప్రజాతంత్ర సంఘటన (పిడియఫ్) నిర్మాణానికి ఉపకరిస్తుంది.

**5. భారత విప్లవ పంథా ఏమిటి?**

భారత విప్లవం విజయవంతమయ్యేందుకు రెండు అంశాలు ఖరారు కావాలి. ఒకటి. పైన వివరించినట్లు, విస్తృతము, శక్తివంతమైన జనతా ప్రజాతంత్ర సంఘటన నిర్మించబడాలి. రెండు దేశవ్యాపితంగా సిపిఐ(యం), వామపక్షాల బలం గణనీయంగా పెరగాలి. ఈ కీలకమైన అంశం, పార్టీ కార్యక్రమంలోని చివరి సెక్షన్ 8లో "కమ్యూనిస్టు పార్టీని నిర్మించటం" శీర్షికతో వివరంగా చర్చించబడింది.

ఎక్కడ కమ్యూనిస్టుపార్టీ బలంగాను, ప్రజల్లో బలమైన మూలాలు కల్గివుంటుందో అలాంటి దేశాల్లో మాత్రమే విప్లవం జయప్రదమైందని ప్రపంచ అనుభవం తెల్పుతున్నది. అందుకు రష్యా (1917), వియత్నాం (1945), కొరియా (1948), చైనా (1949), క్యూబా (1959). వేరొక వైపున, ఆయా దేశాల్లోని కమ్యూనిస్టులు వీరోచితంగా ప్రతిఘటించినప్పటికీ, రక్తసిక్తపుటేరులు పారించిన విప్లవ ప్రతీఘాతాల ఉదాహరణలు కూడా మన ముందున్నాయి. అవి– ఇటలీ (1922), జర్మనీ (1933), స్పెయిన్ (1936), ఇండోనేషియా (1965), చిలీ (1973). తూర్పు యూరపు (1989–1990)లో అంతే క్రౌర్యంగల విషాదకరమైన విప్లవ ప్రతీఘాతాలు సంభవించాయి. చివరకు సోవియట్ యూనియన్‌లోనే (1991).

భారత విప్లవ ప్రణాళిక రూపకల్పనలోనూ దాన్ని చిత్తశుద్ధితో అమలు జరపటంలోనూ విజయాలు, పరాజయాలతో కూడిన ఈ చారిత్రాత్మక గుణపాఠాలన్నింటినీ గమనంలో ఉంచుకోవాలి.

రాష్ట్ర ప్రభుత్వాల్లో పాల్గొనే అంశం పట్ల మన పార్టీ కార్యక్రమం ఇలా అభిప్రాయపడుతున్నది : "త్వరితగతిన మారిపోయే రాజకీయ పరిస్థితి అవసరాలకు అనుగుణంగా పలు తాత్కాలిక నినాదాలను పార్టీ రూపొందించుకోవలసి ఉంటుంది. ప్రస్తుత పాలక వర్గాలను కూలదోసి, బలమైన కార్మిక కర్షక ఐక్యత ఆధారంగా నూతన ప్రజాతంత్ర రాజ్యాన్ని, ప్రభుత్వాన్నీ స్థాపించాల్సిన కర్తవ్యాన్ని ప్రజల ముందుంచుతుంది. దానితోపాటు, ప్రజలకు ఉపశమనం కల్గించే ఒక కార్యక్రమం అమలు జరిపేందుకు అంకితమైన ప్రభుత్వాలను ఏర్పరచటానికి లభించే అన్ని అవకాశాలనూ పార్టీ ఉపయోగించుకుంటుంది. ఉన్న పరిమితుల్లోనే, ప్రత్యామ్నాయ విధానాలను ముందుకు తెచ్చేందుకు, అమలు జరిపేందుకు పార్టీ కృషి చేస్తుంది. అలాంటి ప్రభుత్వాలను ఏర్పరచటం, శ్రామిక ప్రజల విప్లవోద్యమానికి గొప్ప

ఊపునిస్తుంది. ఆవిధంగా జనతా ప్రజాతంత్ర సంఘటన నిర్మాణ క్రమానికి దోహదపడుతుంది. అయితే అది, దేశం ఎదుర్కొనే ఆర్థిక, రాజకీయ సమస్యలకు ఎలాంటి మౌళిక పరిష్కారాలను సాధింపజాలదు. అందుకే, పార్టీ రాష్ట్రాలు లేదా కేంద్రంలో నిర్దిష్ట పరిస్థితుల ప్రాతిపదికన అలాంటి ప్రభుత్వాల ఏర్పాటుకుగల అవకాశాలన్నింటినీ ఉపయోగించుకుంటుంది. ఆ విధంగా, ఒక వైపు ప్రజా ఉద్యమాలను బలోపేతం చేస్తూనే, మరో వైపు బడా బూర్జువా నాయకత్వానగల ప్రస్తుత బూర్జువా భూస్వామ్య రాజ్యాంగ యంత్రాన్ని, ప్రభుత్వాన్నీ తొలగించాల్సిన అవసరాన్ని ప్రజలకు బోధిస్తూనే ఉంటుంది." (పేరా 7.17)

తరచూ ఎదురౌతున్న ప్రశ్నలు : భారత విప్లవం శాంతియతమా? అందుకు పార్టీ కార్యక్రమం ఇలా చెప్తున్నది : "జనతా ప్రజాస్వామ్యం స్థాపనను, సోషలిస్టు పరివర్తననూ శాంతియుత మార్గాల్లో సాధించేందుకు భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కృషి చేస్తుంది. అందుకోసం, శక్తివంతమైన ప్రజా విప్లవోద్యమాన్ని అభివృద్ధి చేసేందుకు, పార్లమెంటరీ మరియూ పార్లమెంటరీయేతర పోరాట రూపాలను మిళితం చేసేందుకు పార్టీ ప్రయత్నిస్తుంది. తద్వారా కార్మిక వర్గం, దాని మిత్రులూ అభివృద్ధి నిరోధక శక్తుల ప్రతిఘటనలను అధిగమించేందుకు; ఈ పరివర్తనను శాంతియుతంగా సాధించేందుకు శాయశక్తులా కృషిచేస్తాయి. అయితే పాలక వర్గాలు, తమ అధికారాన్ని ఎన్నడూ ఐచ్ఛికంగా వదులుకోవని నిరంతరం గమనంలో ఉంచుకోవటం అవసరం. ప్రజల అభిప్రాయాన్ని వమ్ముచేసేందుకు చట్ట ఉల్లంఘనలు, హింసాకాండల ద్వారా అవి ప్రయత్నిస్తాయి. అందుకే విప్లవకర శక్తులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. అన్ని రకాల అననుకూల పరిస్థితులను, దేశ రాజకీయ పరిస్థితుల్లో వచ్చే ఎలాంటి మార్పులు, మలుపులనైనా ఎదుర్కొనేందుకు వీలుగా తమ కృషిని నిర్ధేశించుకోవాలి." (పేరా 7.18)

గత కాలపు కమ్యూనిస్టు ఉద్యమంలో ఒక చర్చ సాగేది. అది, భారత విప్లవ పథం 'రష్యా మార్గమా? చైనా మార్గమా?' అని. ఈ రెండూ కాదని సిపిఐ(యం), చాలా కాలం క్రితమే స్పష్టం చేసింది. పై రెండు దేశాల్లోని విప్లవం జయప్రదమైన నాటి పరిస్థితులతో పోల్చినపుడు; ఆనాడు –నేడు కూడా భారత్‌లోని నిర్దిష్ట పరిస్థితులు భిన్నమైనవి. "నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా అధ్యయనం చేయాలి" అనేది లెనిన్ సిద్ధాంతం. దాని ప్రకారం భారత్‌లో నెలకొన్న నిర్దిష్ట పరిస్థితులను అనుసరించి మాత్రమే భారత విప్లవ పథం ఉంటుంది.

## డి. పార్టీ కార్యక్రమంలో ఎనిమిది ప్రధాన సెక్షన్‌లు

2000లలో తాజాపరచబడిన కార్యక్రమంలో ఎనిమిది సెక్షన్‌లు ఉన్నాయి. సంక్షిప్తంగా ఆ ఎనిమిది సెక్షన్‌లు, ప్రత్యేకంగా తాజాపరచబడిన కార్యక్రమంలో చేయబడిన ప్రధాన మార్పులు ఇలా ఉన్నాయి :

**1 పరిచయం**

నూతన తరం పార్టీ సభ్యులు, సానుభూతిపరులకు దేశ స్వాతంత్ర్యం కోసము, జనతా ప్రజాస్వామ్య సాధన లక్ష్యం కోసం జరిగిన పోరాటంలో, పార్టీ నిర్వహించిన చారిత్రక పాత్రను తెలియజేయటమే ఈ సెక్షను ఉద్దేశ్యం. స్వాతంత్ర్యోద్యమంలో మన పార్టీ చేసిన అనన్య సామాన్యమైన త్యాగాలతో, మరే ఇతర పార్టీ పోటీపడ లేదు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న పలు స్రవంతుల విప్లవకారులు కమ్యూనిస్టు పార్టీలో చేరారు. కమ్యూనిస్టు ఉద్యమం ప్రజాపోరాటాలకు నాయకత్వం వహిస్తూ, అణచివేతలను ధిక్కరిస్తూ, జాతీయ స్రవంతిలో తానొక ముఖ్యమైన స్థానాన్ని అలంకరించింది. ఈ చాప్టర్, కమ్యూనిస్టు పార్టీ ప్రారంభం నుండి నిర్వహించిన పాత్రను సింహావలోకనం చేస్తున్నది. అది, ఆవిర్భావ కాలం నుండి పార్టీ చరిత్రను రేఖామాత్రంగా చిత్రిస్తున్నది. ఈ సెక్షనులోని కొన్ని ముఖ్యమైన అంశాలు:

ఎ. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరులో పార్టీ పాత్ర. 1921లో, మొదట “సంపూర్ణ స్వాతంత్ర్యం” నినాదాన్నిచ్చింది పార్టీనే.

బి. పార్టీ, ‘స్వరాజ్’ పిలుపుకు సామాజిక, ఆర్థిక సారాంశాన్ని సమకూర్చింది, భూస్వామ్య విధానం రద్దు, దున్నే వారికే భూమి డిమాండ్లను సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటానికి తోడుచేసింది.

సి. ఎఐకెయస్, ఎఐయస్‌యఫ్‌లను ఏర్పరచటంలోను, ఎఐటియుసిని శక్తివంతం చేయటంలోను పార్టీ కీలక పాత్రను పోషించింది.

డి. బ్రిటీష్‌వారి నిషేధాజ్ఞలు, జైలు శిక్షలు, చిత్రహింసలు, అభ్యుదయ సాహిత్యంపై నిషేధాలు వంటి అణచివేతలను ఎదుర్కొని పార్టీ ఎదిగింది.

ఇ. అనేక చారిత్రక పోరాటాల ద్వారా యుద్ధానంతర వెల్లువకు, కమ్యూనిస్టుల నాయకత్వం వహించారు. ఆ పోరాటాల్లో కొన్ని : తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం, ఉన్నప్రా–వయలార్, ఉత్తర మలబార్, తెభాగా రైతాంగ పోరాటాలు; అస్సాం, త్రిపురల్లో భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు; వర్లీ ఆదివాసుల పోరాటం. వాటిలో తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం అత్యంత ముఖ్యమైనది.

యఫ్. ఫాసిజం ఓటమి, జాతీయ విముక్తి పోరటాలు ముందుకుసాగటంతో జాతీయ స్వాంతంత్ర్యానికి రంగం సిద్ధమైంది. ఆ పూర్వరంగంలో, బ్రిటీష్ సామ్రాజ్యవాదం కాంగ్రెస్, ముస్లిం లీగుతో రాజీపడింది. ఫలితంగా భారత్, పాకిస్తాన్ రెండు స్వతంత్ర రాజ్యాలు ఉనికిలోకి వచ్చాయి.

జి. కమ్యూనిస్టు ఉద్యమం, భారత రాజకీయాల్లో బూర్జువా భూస్వామ్య పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో గణనీయమైన పాత్రను పోషించింది.

## 2 వర్తమాన ప్రపంచంలో సోషలిజం

సోషలిజం, 'మానవవాళికి భవిష్యత్తు' అని కార్యక్రమం నొక్కిచెప్పింది. 20వ శతాబ్దంలో, సోవియట్ యూనియన్, చైనా తదితర సోషలిస్టు దేశాలు అసాధారణమైన విజయాలు సాధించాయన్నది వాస్తవం. ఆ దేశాలు, నిరంతరం సామ్రాజ్యవాదుల దాడులను ఎదుర్కొంటూనే; అతి తక్కువ కాలంలో నిరుద్యోగం, పేదరికం, నిరక్షరాస్యత, వెనుకబాటు తనము వగైరా రుగ్మతలను అధిగమించగలిగిన తీరు, సోషలిజం శక్తిని తెలియజేస్తున్నది. ఆ దేశాలు ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, శాస్త్ర సాంకేతిక రంగాల్లో చరిత్రలో కనీవినీ ఎరుగని ప్రగతిని సాధించాయి. సాధించిన ఈ విజయాలు, పెట్టుబడిదారీ దేశాలపై కూడా ప్రభావం చూపుతున్నాయి.

సోసలిజం నిర్మించే క్రమంలో జరిగిన పొరపాట్ల ఫలితంగానే, సోవియట్ యూనియన్ మరి కొన్ని దేశాల్లో సోషలిజం వెనుకపట్టు పట్టింది. ఆ పొరపాట్లు : ఆర్థిక, మేనేజిమెంట్ రంగాల్లో చేయవలసిన మార్పులను సకాలంలో చేపట్టకపోవటం, రాజ్యం సంపూర్ణంగా పార్టీతో మమేకమైన దశలో, లోపభూయిష్టమైన పార్టీ పాత్ర, సోషలిస్టు ప్రజాస్వామ్యాన్ని విస్తరించటంలో వైఫల్యం, ప్రజల సైద్ధాంతిక చైతన్యం క్షీణించటం. ఈ వక్రీకరణలు మార్క్సిజం ప్రాసంగికతలో వైఫల్యం మూలంగా కాదు. ఆ వైఫల్యాలు మార్క్సిజం సిద్ధాంతం, ఆచరణల నుండి దారి తప్పడానికి సూచికలుగా నిలుస్తున్నాయి.

వర్తమాన సోషలిస్టు దేశాలైన చైనా, వియత్నాం, క్యూబా, ఉత్తర కొరియా, లావోస్‌లు సోషలిజం లక్ష్యాన్ని సమున్నతంగా నిలిపేందుకు ధృడంగా యత్నిస్తున్నాయి. సామ్రాజ్యవాదుల వత్తిడులు, కుయుక్తులను తట్టుకుని నిలబడుతున్నాయి. సోషలిజం కోసం జరిపే పోరాటం సుదీర్ఘమైనది. సోషలిజం నిర్మాణం అనేక తీవ్రమైన పోరాట దశల గుండా పయనించవలసిన ఒక సుదూర ప్రక్రియ.

ప్రపంచ పెట్టుబడిదారీ విధానానం, మానవాళి మౌళిక సమస్యలను పరిష్కరించలేదు. అదే పెట్టుబడిదారీ విధానం శాస్త్ర, సాంకేతిక పురోభివృద్ధిని

వినియోగించి ఉత్పత్తి శక్తులను అభివృద్ధి చేయగల్గింది. కానీ ఆ విధానం, నిరుద్యోగం, ఆదాయాలు సంపదల్లో నెలకొన్న సునిశితమైన అసమానతలను రూపుమాప లేదు. సంపదలు, ఆస్తుల కేంద్రీకరణ తీవ్రమౌతున్నది. సామ్రాజ్యవాదం కూడా ఐయంయఫ్, ప్రపంచ బ్యాంకు, డబ్లుటివొ వంటి సంస్థల ద్వారా; మూడవ ప్రపంచ దేశాలను దోపిడీ చేయటాన్ని ముమ్మరం చేసింది. కార్మిక వర్గపు సామాజిక భద్రతలో అటవికమైన కోతలు, ఉపాధి రహిత అభివృద్ధి, క్రమ రహితమైన (క్యాజువలైజేషన్) శ్రామిక విధానము వంటివి వర్తమాన పెట్టుబడిదారీ విధానపు లక్షణాలు పెట్టుబడిదారీ విధానం సంక్షోభంతో కూడిన ఒక వ్యవస్థగానే కొనసాగుతున్నది.

ద్రవ్య పెట్టుబడి అంతర్జాతీయకరణ గతంలో ఏనాడూ లేని స్థాయికి చేరింది. దీన్నే 'ప్రపంచీరణ' అంటున్నారు. ద్రవ్య పెట్టుబడి, వేగవంతమైన స్పెక్యులేటివ్ లాభాల వేటలో ప్రపంచ వ్యాపితంగా పరిభ్రమిస్తున్న కాలమిది. గత రెండు దశాబ్దాల్లో, అత్యధిక జనాభా నివశిస్తున్న మూడవ ప్రపంచ దేశాలకు, సంపద్వంతమైన అభివృద్ధి చెందిన దేశాలకు మధ్య విభజన తీవ్రతరమౌతున్నది. బహుళ జాతి సంస్థలు తమ లాభాల కోసం దురాశాపూరిత దురాక్రమణలకు పాల్పడుతున్నది. దానితో, పర్యావరణానికి ముప్పు పెరుగుతున్నది. అమెరికా సామ్రాజ్యవాదం, తన ఆధిపత్యాన్ని స్థిరపర్చుకునేందుకు ఆర్థిక, రాజకీయ, సైనిక శక్తిని దూకుడుగా వినియోగిస్తున్నది.

## నాలుగు ప్రధాన సామాజిక వైరుధ్యాల చెల్లుబాటు

నేటి ప్రపంచంలో నాలుగు ప్రధాన సామాజిక వైరుధ్యాలు మనుగడలో ఉన్నట్లు కార్యక్రమం నొక్కిచెబుతున్నది. ఆ వైరుధ్యాలు : సోషలిజానికి– సామ్రాజ్యవాదానికి మధ్య ; సామ్రాజ్యవాదానికి – మూడవ ప్రపంచ దేశాలకు మధ్య; సామ్రజ్యవాదులకు – పెట్టుబడిదారులకు మధ్య అంతర్గత వైరుధ్యాలు; పెట్టుబడిదారీ దేశాల్లో శ్రమకు –పెట్టుబడికి మధ్య నెలకొన్న వైరుధ్యాలు.

1917 అక్టోబరు విప్లవంతో ప్రపంచంలో సోషలిస్టు వ్యవస్థ మనుగడలోకి వచ్చింది. నాటి నుండి సామ్రాజ్యవాదము, సోషలిజాల మధ్య వైరుధ్యమే కేంద్ర వైరుధ్యంగా కొనసాగుతున్నది. మారిన ప్రపంచ పరిస్థితుల్లో కూడా నేటికీ, అదే ప్రధాన వైరుధ్యంగా కొనసాగుతున్నది. పెట్టుబడిదారీ విధానానికి సోషలిజమే ఏకైక ప్రత్యామ్నాయ సామాజిక వ్యవస్థ. అభివృద్ధి క్రమంలో, నాలుగులో ఏదో ఒక వైరుధ్యం తీవ్రతరమౌతుంది. ముందుకొస్తుంది. నయా–ఉదారవాదపు ప్రపంచీకరణ దాడి విజృంభిస్తున్న నేపథ్యంలో సామ్రాజ్యవాదానికి, మూడవ ప్రపంచ దేశాలకు మధ్య వైరుధ్యం ముందుకొస్తున్నది.

## 3 స్వాతంత్ర్యం – అనంతరం

ఈ కొత్త సెక్షన్ క్రింది అంశాలను రేఖా మాత్రంగా పరిశీలిస్తుంది : స్వతంత్ర భారతదేశంలో, స్వాతంత్ర్యానంతర పాలకులు అనుసరించిన పెట్టుబడిదారీ అభివృద్ధి పంథా; భారత బూర్జువాల ద్వంద్వ స్వభావము– సామ్రాజ్యవాదంతో వారి వివాదాలు, మిలాఖత్‌లు; ప్రభుత్వ రంగం అభివృద్ధి– అనంతరం కూలగొట్టడం; 1991 తర్వాత, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ప్రవేశానికి ఆర్థిక రంగాన్ని తెరచి ఉంచటం; ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్లుటివొ) వ్యవస్థను ఆమోదించటం; శ్రామిక జనంపై భారాలు మోపడం; భూస్వామ్య వ్యతిరేక చర్యలు చేపట్టడంలో వైఫల్యము; వ్యవసాయంలో పెట్టుబడిదారీ విధానాన్ని అభివృద్ధిచేయటంతోపాటు, సరళీకరణ, ప్రపంచీకరణ విధానాలను తీవ్రంగా అమలు చేయడం.

1964 కార్యక్రమం మొదటి ఒకటిన్నర దశాబ్దాల పరిస్థితిని పరిశీలించింది. ప్రస్తుత 2000 తాజాపరచిన కార్యక్రమంలో, 1947 తర్వాత ఐదు దశాబ్దాల పరిణామాలు పొందుపరచబడ్డాయి. అందులో, బూర్జువా – భూస్వామ్య రాజ్యం అనుసరించిన పారిశ్రామిక, వ్యవసాయ విధానాలను పరిశీలించింది. 1950ల నుండి అవలంబించిన విధానాలను వివరించింది. పాలక వర్గాలు, నిర్దిష్ట అభివృద్ధి నమూనా (స్టేట్ క్యాపిటలిజం)ను పరిమిత ప్రణాళికతో అనుసరించాయి. బడా బూర్జువాలు, తమ పరిమిత పెట్టుబడితో భారీ పరిశ్రమలు, మౌళిక వసతులను నిర్మించగల ఆర్థిక పునాది లేనందున, ప్రభుత్వ రంగం అభివృద్ధి, రాజ్యం క్రమబద్ధీకరణ (రెగ్యులేషన్) వంటి విధానాలను అనుసరించారు.

సోవియట్ యూనియన్ సహకారంతో జరిగిన ఆ నమూనా అభివృద్ధి, ఒక మోస్తరు పారిశ్రామీకరణకు, స్వదేశీ శాస్త్ర పరిశోధనా పునాది అభివృద్ధికి దోహదపడింది. సామ్రాజ్యవాదుల వొత్తిడి నుండి బైటపడేందుకు కొంత మేరకు సహాయపడింది. ఏది ఏమైనా రాజ్యం, బూర్జువాల నాయకత్వంలో ఉన్నందున గుత్త పెట్టుబడిదారుల అభివృద్ధికి, ప్రజలను దోచుకునేందుకు, విదేశీ పెట్టుబడులు, రుణాలపై అధికంగా ఆధారపడేందుకు దారితీసింది.

అంతర్జాతీయంగా సోవియట్ పతనం, సామ్రాజ్యవాదం ఎదురు దాడి, దేశంలో అంతర్గతంగా పెట్టుబడిదారీ పంథా సంక్షోభంలో పడటంతో, భారత బడా బూర్జువాలు సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలను అక్కున చేర్చుకున్నారు. పెట్టుబడిని పోగేసుకునేందుకు రాజ్యాధికారాన్ని వినియోగించుకున్న బడా బూర్జువాలు, ఇపుడు ప్రభుత్వ రంగంలోని కీలక విభాగాలను స్వాధీనం చేసుకునేందుకు ఉ

వ్విళ్లూరుతున్నారు.

సరళీకరణ విధానాలు ఆర్థిక సార్వభౌమత్వం క్షీణతకు దారితీస్తున్నాయి. ప్రభుత్వ రంగం విధ్వంసమౌతున్నది. దేశంలోని అన్ని ఆర్థిక విభాగాల్లోనూ, సామ్రాజ్యవాదుల ద్రవ్య పెట్టుబడి చొరబడుతున్నది. పెరునగుతున్నది. స్వయం సంవృద్ధిని వెనుకపట్టు పట్టించే చర్యలు; నూతన డబ్లుటివొ వ్యవస్థ బలపడటంవంటి ధోరణులకు దారీతీస్తున్నది.

స్వాతంత్ర్యానంతర 50 సంవత్సరాల్లో అనుసరించిన పెట్టుబడిదారీ అభివృద్ధి పంథాతో, రాజ్యానికి నాయకత్వం వహిస్తున్న బడా బూర్జువాలు గరిష్టంగా లబ్ది పొందారు. 1957-1997 మధ్య వారి సంపదలు 500ల రెట్లు పెరిగాయి. విచక్షణా రహితమైన విదేశీ పెట్టుబడుల ప్రవేశంతో కీలక రంగాల్లోని స్వదేశీ పరిశ్రమలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. దిగుమతి పన్నులు తగ్గింపుతో అనేక స్వదేశీ పరిశ్రమలు మూతబడుతున్నాయి.. ఫలితంగా, లక్షలాది కార్మికులు ఉపాధులు కోల్పోయి వీధులపాలౌతున్నారు. బడాయేతర బూర్జువాల్లోని ఒక భాగం విదేశీ పెట్టుబడితో మిలాఖత్ అయ్యేందుకు అంగీకరించటంలేదు. అయినప్పటికీ, ఉదారవాద విధానాలతో చిన్న మధ్యతరగతి పెట్టుబడిదారుల్లోని పెద్ద భాగం దారుణంగా దెబ్బతింటున్నారు.

ప్రజలపై సరళికృత విధానాల ప్రభావాన్ని, దిగజారిపోతున్న వారి జీవన పరిస్థితులనుబట్టి గమనించవచ్చు.

గత దశాబ్ద కాలంలో, గ్రామీణ ప్రాంతాల్లో దరిద్ర రేఖకు దిగువనవున్న వారి సంఖ్య పెరుగుతున్నది. సామాజిక రంగం వ్యయంలో కోతలు, ప్రజాపంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేయటంవంటి వినాశకర విధానాలు పేదలను, గామీణ, పట్టణ ప్రాంతాల్లోని మహిళలను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. సరళీకరణ, ప్రైవేటీకరణల దాడుల దుష్ఫలితాలకు శ్రమజీవులు బలౌతున్నారు. సంఘటిత రంగం వెలుపల లక్షలాది కార్మికులకు లేబరు చట్టాలు ద్వారా ఎలాంటి రక్షణలు లేవు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనాలు కూడా వారికి దక్కటం లేదు. పెట్టుబడిదారీ అభివృద్ధి మార్గమంతా స్వదేశీ బూర్జువాలు, విదేశీ పెట్టుబడిదారులు భారీ లాభాలు పోగేసుకునేందుకే అవకాశమిస్తున్నది. అందుకు, శ్రామిక ప్రజల ప్రయోజనాలను పణంగా పెడుతున్నది.

### వ్యవసాయ సంబంధాలు

వ్యవసాయ విప్లవ కర్తవ్యాలను పూర్తిచేయటమే, ప్రజాతంత్ర విప్లవ స్థాపన సారాంశం. ఈ క్రమంలో, వ్యవసాయ సంబంధాలు చాలా ముఖ్యమైనవి. ఈ చాప్టరులోని తరువాత భాగం, ఆ వ్యవసాయ సంబంధాలను వివరిస్తుంది.

బడా బూర్జువాలు, స్వాతంత్ర్యానంతరం రాజ్యాధికారాన్ని కైవసం చేసుకునేందుకు భూస్వాములతో రాజీపడ్డారు. ఆ వైఖరితో వారు, ప్రజాతంత్ర విప్లవ కర్తవ్యాలను పూర్తిచేసేందుకు, మౌళిక భూ సంస్కరణల అమలును తిరస్కరించేందుకు దారితీసింది. అందువల్లనే, రైతాంగం విముక్తి కాలేదు. వేరొక వైపున బూర్జువాల వ్యవసాయ సంస్కరణలతో లక్షలాది కౌలుదారులు భూమి నుండి గెంటివేయబడ్డారు. ఈ విధానాలవల్ల, పెట్టుబడిదారీ భూస్వాములు, ధనిక రైతాంగంతో కూడిన ఒక నూతన వర్గం లబ్ధిపొందింది. భూ కేంద్రీకరణ కొనసాగుతున్నది. పెరిగింది కూడా.

వ్యవసాయంలో పెట్టుబడిదారీ అభివృద్ధి – మార్కెట్ కోసం ఉత్పత్తికి, రైతాంగంలోని ఒక భాగం కార్మికులుగా మారేందుకు; రైతాంగంలో తారతమ్యాల సృష్టికి; నూతన సాంకేతిక పరిజ్ఞానము, విత్తనాలు, ఇతర ఉత్పాదకాల వినియోగం ఉత్పాదకత పెరుగుదలకు; ముఖ్యంగా ఆహార ధాన్యాల ఉత్పాదకత పెరుగుదలకు దారితీస్తున్నది. ఈ విషయాలన్నీ ఈ చాప్టరులో వివరించబడినాయి. అసమానతలు పెరుగుతాయని, పెట్టుబడిదారీ అభివృద్ధి ప్రమాదాలే ఈ అసమానతల స్వభావమని కూడా కార్యక్రమం నొక్కిచెప్పింది. పెట్టుబడిదారీ విధానం పురోగమించిన కొన్ని ప్రాంతాలున్నాయి. మరి కొన్ని ప్రాంతాల్లో అర్ధ భూస్వామ్య, పెట్టుబడిదారీ పూర్వ సంబంధాలు కొనసాగుతున్నాయి.

బ్యాంకులు, సహకార సంస్థలు, పంచాయితీలు వగైరా గ్రామీణ సంస్థలను అదుపుచేసే ఒక గ్రామీణ సంపన్నుల కూటమి అభివృద్ధి చెందింది. పలుకుబడిని సంపాదించింది. చట్ట వ్యతిరేక అధిక వడ్డీ వ్యాపారం పెరుగుతున్నది.

రైతాంగం, పెట్టుబడిదారీ మార్కెట్ ఒడిదుడుకులకు గురౌతున్నది. అర్ధ భూస్వామ్య వ్యవస్థ దోపిడిలో భాగంగా కులము, సామాజిక అణచివేతలు కొనసాగుతున్నాయి. వ్యవసాయ కార్మకుల పరిస్థితులు మరింతగా క్షీణించాయి. వారికి, సంవత్సరానికి 100 రోజుల కంటే తక్కువగానే ఉపాధి దొరుకుతున్నది. కనీస వేతనాలు, ఇతర సామాజిక రక్షణలకు భరోసా లేదు.

సరళీకరణలతో నూతన బెదిరింపులు తలెత్తుతున్నాయి. బహుళ జాతి కార్పోరేషన్‌లు, వ్యవసాయ రంగపు ఉత్పత్తుల కొనసుగోళ్లు, ఉత్పాదకాల అమ్మకాల మార్కెట్‌లోకి ప్రవేశించాయి. డబ్లుటిఒ వ్యవస్థతో, వ్యవసాయ సరుకుల దిగుమతులు మన దేశపు స్వయం సంవృద్ధ శక్తిని నాశనం చేస్తాయి. ఆహార భద్రతకు ముప్పు కల్గిస్తాయి. ప్రభుత్వ వ్యయంలో కోతలు, నీటి పారుదల, విద్యుత్ రంగాల ప్రైవేటీకరణలు పేదలను బలంగా దెబ్బతీస్తున్నాయి.

సరళీకరణ ప్రభావం, గ్రామీణ నిరుద్యోగం పెరుగుదలకు, మహిలు

ఉపాధులు కోల్పోయేందుకు దారితీస్తున్నది. సామ్రాజ్యవాదం, వ్యవసాయ క్షేత్రంలోకి నేరుగా ప్రవేశిస్తున్నది. అన్ని వైరుధ్యాలూ రానున్న రోజుల్లో తీవ్రతరమై తీరుతాయి. సరళీకరణ విధానాల ముసుగులో విద్యా వ్యవస్థ, సంస్కృతి, పరిపాలన తదితర రంగాల్లో సామ్రాజ్యవాదుల చొరబాటు, ప్రభావం పెరిగాయి.

మోడీ నాయకత్వంలోని గత దశాబ్దకాలపు బిజెపి, ఆర్‌యస్‌యస్‌ల ప్రభుత్వ పాలనలో ఈ విభాగంలో విశ్లేషించబడిన అన్ని లక్షణాలూ మరింత తీవ్రతరమైనాయి. ప్రజలపై వినాశకరమైన ముప్పును కల్గిస్తున్నాయి.

### 4 విదేశాంగ విధానం

విదేశాంగ విధానపు మౌలిక సూత్రీకరణ ఇలా ఉద్ఘాటిస్తున్నది : "ఏ రాజ్యం, దాని ప్రభుత్వం విదేశాంగ విధానమైనా, అంతిమ విశ్లేషణలో దాని ఆంతరంగిక విధానపు వ్యక్తీకరణగానే ఉంటుంది. ఆ రాజ్యానికీ, ఆ ప్రభుత్వానికి ఆధిపత్యం వహిస్తున్న వర్గం లేదా వర్గాల ప్రయోజనాలనే అది ప్రధానంగా ప్రతిబింబిస్తూ ఉంటుంది." (పేరా 4.1)

కార్యక్రమం, విదేశాంగ విధానంలోని ప్రధాన ధోరణులను మూడు దశలుగా సంక్షిప్తీకరిస్తున్నది. మొదటి దశ, స్వాతంత్ర్యానంతరం నుండి 1950ల మధ్య వరకు. అప్పటికింకా భారత పాలక వర్గాలు, సామ్రాజ్యవాద శక్తుల నీడలోనే ఉన్నాయి.

**రెండవ దశ.** అలీన విధానం ఆధారిత మరింత స్వతంత్రమైన విదేశాంగ విధానం రూపొందింది. కొన్ని ఊగిసలాటలున్నప్పటికీ, స్థూలంగా ఈ విధానం ప్రపంచ శాంతికి, జాతీయ విముక్తి పోరాటాలకు మద్దతుగా నిలిచినట్లు ఆ కాలంలో గుర్తింపు పొందింది.

**మూడవది.** వర్తమాన దశ సోవియట్ పతనంతో, సరళీకృత ఆర్థిక విధానలవైపు మళ్లటంతో ప్రారంభమైంది. తొంభైలలో సామ్రాజ్యవాద అనుకూల ధోరణి కన్పించింది. బిజెపి అధికారానికి రావటంతో ఆ ధోరణి పైకి ఎగబాకుతున్నది. తాను, అమెరికాకు జూనియర్ భాగస్వామినని బహిరంగంగా ప్రకటిస్తున్నది. సంయుక్తంగా అణు పరీక్షల నిర్వహణతో, అమెరికా వైపు మొగ్గు ప్రాధాన్యత పెరిగింది. బిజెపి ఒక సామ్రాజ్యవాద అనుకూల పార్టీ అనేది స్పష్టం. ఒక సామ్రాజ్యవాద వ్యతిరేక, అలీన, స్వతంత్ర విదేశాంగా విధానం కోసం మనం పోరాడాలి.

### 5 రాజ్యాంగ యంత్రము - ప్రజాస్వామ్యము

ఈ భాగంలో భారత దేశపు రాజ్యాంగ యంత్రం స్వభావం నిర్వచించబడింది. పార్టీ కార్యక్రమం, భారతదేశపు రాజ్యాంగ యంత్రం స్వభావాన్ని ఇలా నిర్వచించింది: "5.1 ప్రస్తుత రాజ్యాంగ యంత్రం బడా బూర్జువా నాయకత్వానగల బూర్జువా - భూస్వామ్య పరిపాలనా సాధనం. ఈ బూర్జువా వర్గం, పెట్టుబడిదారీ అభివృద్ధి మార్గాన్ని

అనుసరించే లక్ష్యంతో విదేశీ ద్రవ్య పెట్టుబడితో అంతకంతకూ మిలాఖత్ అవుతున్నది. ఈ వర్గ స్వభావమే మన దేశ జీవితంలో రాజ్యాంగ యంత్రం పాత్రనూ, విధులనూ ప్రధానంగా నిర్ణయిస్తున్నది." (పేరా 5.1) రాజ్యం గురించి ఇది సరైన సూత్రీకరణ. తద్వారా, రాజ్యం గురించి సిపిఐ, నక్సలైట్ల అవగాహన తప్పని రుజువౌతున్నది.

ఈ విభాగం రాజ్యాంగ యంత్రము, రాజ్యాధికారానికి చెందిన పలు సాధనాలను విశ్లేషిస్తుంది. దాని వర్గ స్వభావాన్ని బహిర్గతం చేస్తుంది. అది ప్రజాసామ్యాన్ని వక్రీకరిస్తున్న తీరును వ్యక్తం చేస్తుంది.

**ఎ.** ఈ చాప్టరు సమాఖ్య చట్రానికి వ్యతిరేకతను, కేంద్ర – రాష్ట్రాల సంబంధాలను విశ్లేషిస్తుంది. అధికారాన్ని కేంద్రీకృతం చేసుకున్న బడా పెట్టుబడిదారులకు– బడాయేతర పెట్టుబడిదారులరులకు, వారితోపాటు రాజ్యంలోని ఇతర అన్ని తరగతుల ప్రజానీకానికి మధ్య నెలకొన్న వైరుధ్యాలను సూటిగా గుర్తిస్తుంది. అత్యధిక ప్రాంతీయ రాజకీయ పార్టీలు ఆవిర్భవించిన తీరు ఈ వైరుధ్యాన్ని వ్యక్తం చేస్తున్నది.

**బి.** దేశ సమైక్యతా సమస్యలు, ప్రత్యేకంగా ఈశాన్య భారతం, జమ్ము కాశ్మీరు సమస్యలను ఈ విభాగం విశదీకరిస్తుంది. సామ్రాజ్యవాదం, ప్రజల్లోని పరాయీకరణ భావాలను ఉపయోగించుకుని వేర్పాటువాద ఉద్యమాలను బలపరుస్తున్నది. ఈశాన్య ప్రాంతాలు, జమ్ము కాశ్మీరు ప్రజల ప్రాణాధారమైన జాతీయ సమైక్యతకు సంబంధించిన సమస్యలను ప్రజాస్వామ్యయుతంగా పరిష్కరించటంలో బూర్జువా – భూస్వామ్య వర్గాల వైఫల్యాలకు అద్దం పడుతున్నది. 2019 నుండి జమ్ము కాశ్మీరు సమస్యలపట్ల మోడీ ప్రభుత్వ వైఖరి గుణాత్మకంగా చాలా అధ్వాన్నమైనది. అత్యంత గర్హనీయమైనది.

**సి.** దేశ ప్రజానీకంలో, ఏడు కోట్ల మంది ఆదివాసీలు, గిరిజన ప్రజానీకం దారుణమైన దోపిడికి గురౌతున్న బాధితులుగా కాలం గడుపుతున్నారు. వారు, తమ భూముల నుండి దూరం చేయబడ్డారు. వారికి అటవీ హక్కులు తిరస్కరించబడ్డాయి. గిరిజన ప్రజానీకాన్ని భూస్వాములు, బడా కాంట్రాక్టర్లు కారుచౌకగా దొరికే 'కట్టుబానిసల వనరు'గా వినియోగించుకుంటున్నారు. తమ భాష, సంస్కృతి, అస్థిత్వాలను కాపాడుకోవలసిన అవసరంపట్ల గిరిజన ప్రజానీకం చైతన్యవంతులౌతున్నారు. తమ హక్కుల పరిరక్షణ కోసం 'ప్రాంతీయ స్వయం ప్రతిపత్తి హక్కు' కోసం వారు చేస్తున్న డిమాండు న్యాయసమ్మతమైనది. కానీ, బూర్జువా – భూస్వామ్య వ్యవస్థ వారి న్యాయసమ్మతమైన డిమాండ్లను తిరస్కరిస్తున్నది.

**డి.** బూర్జువాలు, లౌకికతత్వాన్ని వక్రీకరించారు. దాన్ని, ఆ విధంగానే అమలుచేస్తున్నారు. లౌకికతత్వానికి వ్యతిరేకమై ధోరణులను దృఢంగా అరికట్టడానికి మారుగా, వాటికి పలు రాయితీలను అందిస్తున్నారు. అదనపు బలాన్ని

సమకూర్చుతున్నారు. ఫాసిస్టు ఆర్‌యస్‌యస్ నాయకత్వంలోని కూటమి పెరుగుదలతోను, కేంద్రంలో బిజెపి అధికారాన్ని చేపట్టడంతో లౌకిక పునాదులకు ప్రమాదం అపారంగా పెరుగుతున్నది. మెజారిటీ మతతత్వం ఎదుగుదల, మైనారిటీ మతతత్వ శక్తులు బలపడేందుకు దోహదం చేస్తున్నది. జాతీయ సమగ్రతకు ముప్పు ముంచుకొస్తున్నది. కొన్ని సెక్షన్‌ల బడా బూర్జువాలు బిజెపికి మద్దతిస్తున్నారు. మన పార్టీ, లౌకిక సూత్రాల అమలుకు రాజీలేని పోరాటం సాగించాలి. హిందూ మతోన్మాదం, మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడుతున్నది. మైనారిటీల హక్కుల పరిరక్షణ అనేది, ప్రజాస్వామ్యము, లౌకికతత్వాల పటిష్టతకు జరిగే పోరాటానికి కీలకమైన అంశం.

**ఇ.** కుల ఉన్మాద అణచివేతలకు ముగింపు పలకటంలో, బూర్జువా భూస్వామ్య వ్యవస్థ విఫలమైంది. పెట్టుబడిదారీ వ్యవస్థ, కుల వ్యవస్థతో రాజీ పడింది. దళితులు, కుల వ్యవస్థలో అందరి కంటే అధ్వాన్నమైన స్థితిలోని పీడితులు. దళితుల్లో, కుల పీడన నుండి విముక్తికై పెరుగుతున్న చైతన్యంలో ప్రజాస్వామిక సారాంశమున్నది. బూర్జువా పార్టీలు పూర్తిగా తమ ఎన్నికల అవసరాలు, కుల విభజనలను శాశ్వితం చేసేందుకు మాత్రమే కులపరమైన విజ్ఞప్తులకు పూనుకుంటున్నారు. భూమి, వేతనాలు, భూస్వామ్య వ్యతిరేక పోరాటంవంటి మౌళికమైన వర్గసమస్యలను వారు విస్మరిస్తున్నారు. పురాతన సామాజిక వ్యవస్థను కూలదోయటంలో, భూస్వామ్య వ్యతిరేక పోరాటం ఆధారంగా నిలుస్తుంది. ప్రజాస్వామిక విప్లవ సాధనలో, కుల వ్యవస్థ రద్దుకై జరిపే పోరాటం ముఖ్యమైన భాగము. కుల పీడనకు వ్యతిరేక పోరాటం, వర్గ దోపిడికి వ్యతిరేక పోరాటం పరస్పరం ముడివడి ఉన్నాయి.

**యఫ్.** మహిళలు, ఐదు దశాబ్దాల బూర్జువా భూస్వామ్య పాలనలో, గత అనేక శతాబ్దాల పురాతన లింగ వివక్ష సంకెళ్ల నుండి విముక్తి కాలేదు. మహిళలు – మహిళలుగా, కార్మికులుగా, పౌరులుగా పలు దశల్లో దోపిడి, పీడనలకు గురౌతున్నారు. ఈ అసమానమైన హోదాలకు వ్యతిరేకమైన ప్రతిఘటనలు, సమానత్వం కోసం మహిళలు సాగించే ఉద్యమాలన్నీ సామాజిక విముక్తికై సాగే ఉద్యమంలో భాగమే.

**జి.** బూర్జువా– భూస్వాముల పాలనలో అధికారుల బృందము, న్యాయ వ్యవస్థ, రక్షణ దళాలు వంటి రాజ్యాధికారపు సాధనాలు, పాలక వర్గాల ప్రయోజనాల కోసమే ప్రధానంగా పనిచేస్తున్నాయి. ఈ సంస్థల ద్వారా, రాజ్యాంగం పౌరులకు కల్పించిన కొన్ని హక్కులను కాపాడాలి. న్యాయాన్ని సమకూర్చాలి. కానీ, పాలక వర్గాలు తమ స్వప్రయోజనాల కోసం, ఈ సంస్థలను స్పష్టంగా తమ వశంచేసుకుని, వికృతంగా

మార్చేశారు. రాజ్యాంగబద్ధమైన సంస్థలు అనేక సంవత్సరాలుగా నిర్వీర్యమౌతున్నాయి. అవినీతిమయంగా మార్చారు. ఉన్నతాధికారులు, కార్పోరేట్లు, పాలక వర్గ రాజకీయ నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఒక కూటమిగా ఏర్పడుతున్నారు. పోలీసులు అనేక ప్రాంతాల్లో, పేదలను అణచేసే సాధానాలుగా మారారు.

**హెచ్.** రాజ్యాంగ అధికరణాలు, ప్రజలకు కొన్ని ప్రాథమిక హక్కులను కల్పించాయి. కానీ, అవి సాధారణ ప్రజలకు అందుబాటులో లేవు. వాటిలో అనేక హక్కులను వక్రీకరిస్తున్నారు. తప్పుగా వ్యాఖ్యానిస్తున్నారు. వాటిని, రాజ్యపు అధికారులు కూడా ఉల్లంఘిస్తున్నారు. పెట్టుబడిదారీ రాజ్యాధికారము, వారి ప్రభుత్వము అత్యధిక సంఖ్యాకులైన సాధారణ ప్రజల ఓట్లతో ఎన్నికౌతున్నాయి. కానీ సారాంశంలో అవి, అత్యల్ప సంఖ్యాకులైన సంపన్న వర్గాలకే ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. అనేక సంవత్సరాలుగా ప్రజా ఉద్యమాలే, పార్లమెటరీ ప్రజాస్వామ్యాన్ని సజీవంగా నిలబెడుతున్నాయి. ప్రస్తుత పార్లమెంటరీ వ్యవస్థ బూర్జువా పాలనకు ఒక రూపమే అయినప్పటికీ ప్రజల పురోగమనానికి అవకాశం కల్పిస్తోంది.

**ఐ.** పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ప్రమాదం ముంచుకొస్తున్నది, శ్రామిక ప్రజల నుండి, వారి ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న రాజకీయ పార్టీల నుండి మాత్రం కాదు. ఆ ప్రమాదం, కేవలం దోపిడీ వర్గాల నుండి మాత్రమే. వారే ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కుతున్నారు. 1975–77 అత్యవసర పరిస్థితి కాలంలో వ్యక్తమైన పాలకవర్గాల దుశ్చర్యలే అందుకు ప్రత్యక్ష సాక్ష్యం. అధ్యక్ష తరహా పాలన గురించి, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కుదించివేయాలని చేస్తున్న వ్యాఖ్యానాలన్నీ నియంతృత్వ ధోరణులే. సరళీకృత విధానాల ప్రవేశంతోను, అనంతరం సామ్రాజ్యవాద పెట్టుబడి వత్తిడితోనూ, పై ధోరణులు పెచ్చరిల్లుతున్నాయి. అలాంటి బెదిరింపులను ప్రతిఘటించేందుకు, ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు పార్లమెంటరీ, ప్రజాస్వామిక సంస్థలు పరిరక్షించబడాలి. పార్లమెంటరీ యేతర కార్యకలాపాలను తోడుచేసుకుని, అలాంటి సంస్థలను నేర్పుగానియోగించుకోవాలి.

## 6 జనతా ప్రజాస్వామ్యము –దాని కార్యక్రమం

జనతా ప్రజాస్వామిక కార్యక్రమం, జనతా ప్రజాస్వామిక సంఘటనలో భాగస్వాములైన వర్గాల మౌళిక కర్తవ్యాలు, ముఖ్యమైన డిమాండ్లను ఖరారు చేసింది. వాటిని, జనతా ప్రజాస్వామిక విప్లవానంతరం అమలు జరుపవలసి ఉంది.

ఈ భాగం, కార్మిక వర్గం నాయకత్వంలో జనతా ప్రజాస్వామిక విప్లవం కొనసాగాల్సిన ఆవశ్యకతను గురించి ఇలా వివరిస్తుంది : “పెట్టుబడిదారీ పూర్వ

సమాజాన్ని నాశనం చేయటంపట్ల ఆసక్తిగల అన్ని ప్రగతిశీల శక్తులను ఐక్యంచేయటం, ఆ సమాజంలోని విప్లవకర శక్తులన్నింటినీ సంఘటితం చేయాల్సిన బాధ్యత యావత్ కార్మిక వర్గం, దాని పార్టీ భుజస్కందాలపై ఉంది. తద్వారా, జనతా ప్రజాస్వామిక విప్లవాన్ని పూర్తిచేసి, దాని నుండి సోషలిజంకు పరివర్తనచేందేందుకు అవసరమైన భూమికను సులభతరంచేసి, పూర్తిచేసే కర్తవ్యాన్ని అవి స్వీకరించాలి." (పేరా 6.1) బడా బూర్జువాల నాయకత్వంలోని రాజ్యం, కార్మిక వర్గం నాయకత్వంలో జనతా ప్రజాస్వామిక రాజ్యంగా మార్చబడాలి.

**ప్రజాతంత్ర కర్తవ్యాలను పూర్తిచేయటంపైనే, జనతా ప్రజాస్వామిక కార్యక్రమం దృష్టి పెడుతుంది ;**

రాడికల్ భూ సంస్కరణల అమలు చేయటం; వ్యవసాయ కార్మికులు, పేద రైతులకు ఉచితంగా భూమిని పంపిణీ చేయటం ద్వారా భూస్వామ్య విధానాన్ని రద్దుచేయాలన్నది వ్యవసాయ సంబంధాల క్షేత్రంలో ప్రధాన నినాదంగా ఉంటుంది. నష్టపరిహారం లేకుండా లేదా నష్టపరిహారంతోగానీ, భూస్వాముల భూములను స్వాధీనం చేసుకునే సమస్యను, రాజ్యాధికారాన్ని స్వాధీనం చేసుకునే సమయంలోనే నిర్ణయించుకోవలసి ఉంది. ఆ నిర్ణయాన్ని కూడా, ఆ కాలంలో వర్గ శక్తుల బలాబలాల్లో నెలకొన్న మార్పులను దృష్టిలో ఉంచుకునే చేయాలి. చిన్న భూస్వాముల పట్ల వైఖరులు నాటి పరిస్థితులు, వారు నిర్వహించే పాత్రపై ఆధారపడి వుంటుంది.

సోషలిజానికి పరివర్తన పలు దశల ఆర్థిక, సామాజిక నిర్మాణాలపై ఆధారపడిన దీర్ఘకాల ప్రక్రియగా ఉంటుంది. పై అంశాన్ని దృష్టిలో ఉంచుకుని జనతా ప్రజాస్వామ్యంలో, ఆర్థిక విధానాల రూపకల్పన జరుగుతుంది. జనతా ప్రజాస్వామిక ప్రభుత్వం, ప్రభుత్వ యాజమాన్యం నిర్ణయాత్మక పాత్రకు, ప్రభుత్వ రంగం ఆధిపత్యానికి ఉన్నత స్థానం కల్పించేందుకు హామీనిస్తుంది. రాజ్యం, ప్రైవేట్ రంగంతో సహా మొత్తం ఆర్థిక రంగాన్ని క్రమబద్ధీకరణ చేస్తుంది. ఆ రంగానికి మార్గదర్శి పాత్రను నిర్వహిస్తుంది. "జనతా ప్రజాస్వామ్యంలోని ఆర్థిక వ్యవస్థ, ప్రభుత్వరంగానికి ఆధిపత్యం గల్గిన, పలు రూపాల యాజమాన్యాలతో కూడిన ఒక బహుళ నిర్మాణాల వ్యవస్థ " గా ఉంటుంది.

గుత్త వ్యతరేక కర్తవ్యాలను అమలుపరిచే మర్గాన్ని కార్యక్రమం ఇలా ఉటంకిస్తున్నది : "పలు పారిశ్రామిక, ఆర్థిక, వాణిజ్య, సేవా రంగాల్లోనూ స్వదేశీ, విదేశీ గుత్త పెట్టుబడిదారులను వదిలించుకోవచ్చు. ఆ కర్తవ్య నిర్వహణలో భాగంగా, రాజ్యం వారి ఆస్తులను స్వాదీనం చేసుకుంటుంది.

జనతా ప్రజాస్వామ్య పరివర్తనా దశలో స్వదేశీ, విదేశీ గుత్త పెట్టుబడిదారుల ఆధిపత్యాన్ని తోసేసే క్రమంలోని పలు దశల్లో, పలు రూపాల్లో రాజ్యం జోక్యం చేసుకుంటుంది. ఆ పరివర్తనలో, ఆ జోక్యాలు  కీలక భూమికను పోషిస్తాయి.

ప్రజాస్వామిక కర్తవ్యాలను పూర్తిచేసేందుకు, కుల అణచివేతలను నిర్మూలించేందుకు కూడా చర్యలు చేపట్టవలసిన అవసరముంది. మహిళలకు ఆస్తి హక్కుతో సహా,  అన్ని రంగాల్లోనూ సమానత్వాన్ని  ఖరారు చేయాలి. ప్రజలకు ఒక సమగ్ర ప్రభుత్వ విద్యా విధానాన్ని, విస్తారమైన ప్రజారోగ్య వ్యస్థలను అందుబాటులోకి తేవాలి. పర్యావరణము, దేశపు జీవ వైవిధ్యాన్ని, జీవజాల వనరులను పరిరక్షించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి.

కార్మికులు, వ్యవసాయ కార్మికులు, పేద రైతుల జీవన ప్రమాణలను మౌళికంగా మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలను జనతా ప్రజాస్వామిక  రాజ్యం చేపడుతుంది. అందుకు, కేవలం ఉపాధి కల్పనకే పరిమితం కాకుండా సామాజిక భద్రత, గృహవసతివంటి కనీస సౌకర్యాలను కల్పిస్తుంది.

రాజ్యం విదేశాంగ విధానంలో, సామ్రాజ్యవాద వ్యతిరేక విధానాన్ని అవలంభిస్తుంది. అంతర్జాతీయ సంబంధాలను ప్రజాస్వామ్యయుతం చేసేందుకు, ఇరుగుపొరుగు దేశాలతోపాటు వర్ధమాన దేశాల మధ్య సహకారాన్ని పెంపొందించేందుకు కూడా ఆ విధానం ఉద్దేశించబడుతుంది. సామూహిక హననానికి దుర్వినియోగం చేయబడుతున్న అణ్వాయుధాలను, ఇతర మారణాయుధాలను నిషేధించేందుకు అది కృషి చేస్తుంది.

**జనతా ప్రజాతంత్ర కార్యక్రమంలో మరి కొన్ని ముఖ్యమైన అంశాలు :**

1. భారత సమాఖ్య ఐక్యతను పరిరక్షించగల నూతన రాజ్య నిర్మాణాన్ని సృష్టించాలి. అది, దేశంలోని భిన్న జాతులకు నిజమైన సమానత్వము, స్వయం ప్రతిపత్తిని సమకూర్చగల ప్రాతిపదికన నిర్మించబడాలి.

2. జాబితాలపై ఆదారపడిన దామాషా ప్రాతిపదికన, విభిన్న పార్లమెంటు ఇతర శాసన సభలకు ప్రజా ప్రతినిథులను ఎన్నుకోవాలి. స్థానిక సంస్థల నుండి గ్రామ పంచాయితీల వరకూ అధికార వికేంద్రీకరణ జరగాలి. సంబంధిత రాష్ట్రం పరిధిలోనే, గిరిజన ప్రాంతాలకు  'ప్రాంతీయ స్వయం ప్రతిపత్తి'ని కల్పించాలి.

3. భాషా విధానంపై, పరిపాలన తదితర రంగాలన్నింటా, అన్ని జాతీయ భాషలకు కార్యక్రమం సమానత్వానికి  హామీనిస్తున్నది. రెండు. కేవలం హిందీ ఒక్కటే ఏకైక అధికార భాషగా పరిగణించబడదు. పలు భాషలకు సమానత్వాన్ని కల్పించటం

ద్వారా మాత్రమే హిందీకి, దేశవ్యాపితమైన అనుసంధాన భాషగా గుర్తింపు లభిస్తుంది. అప్పటి వరకూ, ప్రస్తుతం అమల్లో ఉన్న హిందీ, ఇంగ్లీషు భాషలను వినియోగించే పద్ధతి కొనసాగుతుంది. మూడవది. పౌరులందరికీ మాతృ భాషలో విద్యా బోధనకు భాషాపరమైన మైనారిటీల హక్కులకు హామీనివ్వాలి.

4. పౌర హక్కులు, కార్మిక సంఘాలతోపాటు పలు వర్గ, ప్రజాసంఘాల ఏర్పాటుకు, హక్కులను గ్యారంటీ చేయాలి. రాజకీయ పార్టీలను ఏర్పరచుకునే హక్కుకు కూడా హామీనివ్వాలి. జనతా ప్రజాస్వామ్యంలో బహుళ పార్టీ వ్యవస్థను దర్శించగల్గాలి.

**7 జనతా ప్రజాతంత్ర సంఘటన నిర్మాణం**

"ప్రస్తుత పురోగమన దశలో మన విప్లవం ప్రధానంగా భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక, గుత్త పెట్టుబడిదారీ వ్యతిరేక, ప్రజాతంత్ర స్వభావం కలిగివుంటుంది. విప్లవాన్ని సాధించటంలో విప్లవదశ, వివిధ వర్గాలు నిర్వహించే పాత్రను కూడా నిర్దేశిస్తుంది. ప్రస్తుత యుగంలో, సోషలిజం సాధన దిశగా ముందుకు సాగేందుకు, కార్మికవర్గం ప్రజాతంత్ర విప్లవానికి తప్పనిసరిగా నాయకత్వం వహించాల్సి ఉంటుంది. ఇది కార్మికవర్గం నిర్మించి నడిపించవలసిన నూతన తరహా జనతా ప్రజాతంత్ర విప్లవమేగాని, పాత తరహా బూర్జువా ప్రజాతంత్ర విప్లవం కాదు." (పేరా 7.2)

ప్రజాతంత్ర విప్లవం పురోగమనానికి గుత్త పెట్టుబడిదారులు, భూస్వాములు, సామ్రాజ్యవాదము ఆటంకంగా ఉన్నాయి. పాలక వర్గాలకు వ్యతిరేక పోరాటంలో కార్మిక వర్గం, రైతాంగంలోని భిన్న సెక్షన్‌లు, పెటీ బూర్జువా వర్గాలు, బడాయేతర బూర్జువాలు 'వర్గకూటమి'లో భాగస్వాములుగా ఉంటారు.

ఈ కూటమికి నాయకత్వ పాత్రను కార్మికవర్గం నిర్వహిస్తుంది. అది మాత్రమే జనతా ప్రజాతంత్ర విప్లవాన్ని సోషలిజం దిశగా ముందుకు నడిపించగల్గుతుంది. జనతా ప్రజాతంత్ర కూటమి పటిష్టమైన కార్మిక – కర్షక ఐక్యతపైనే ఆధారపడి ఉంటుంది.

కార్మిక వర్గపు పునాది మిత్రులుగా, వ్యవసాయ వర్గాల్లోని వ్యవసాయ కార్మికులు, పేద రైతులు ఉంటారు. భూస్వాములు, పెట్టుబడిదారీ భూస్వాములు, బడా పెట్టుబడిదారులు, బహుళ జాతి సంస్థల అధీనంలోని పెట్టుబడిదారీ మార్కెట్‌ల దోపిడీ మూలంగా మధ్య తరగతి రైతాంగం కూడా బాధపడుతున్నారు. వారు కూడా జనతా ప్రజాతంత్ర సంఘటనలో నమ్మకమైన భాగస్వాములుగా ఉంటారు. ధనిక రైతులు, గ్రామీణ ప్రాంతాలను ప్రభావితం చేయగల పాత్రను నిర్వహిస్తున్నారు. వారు, వ్యవసాయ కార్మికులను కూలీలుగా వినియోగించుకుంటున్నారు. అందుకే

వారు పెట్టుబడిదారులు – భూస్వామ్య వర్గాలతో జత కట్టేందుకు మొగ్గుచూపుతున్నారు. కానీ వారు కూడా మార్కెట్, బూర్జువా– భూస్వామ్య ప్రభుత్వపు నయా – ఉదారవాద విధానాల ప్రతికూల ప్రభావపు విధ్వంసాలకు గురౌతున్నారు. అందుకే వారిలో ఊగిసలాట స్వభావమున్నప్పటికీ, కొన్ని సందర్భాల్లో వారిని కూడా జనతా ప్రజాతంత్ర సంఘటనలో భాగస్వాములను చేయవచ్చు. భారత సమాజంలో పట్టణ, గ్రామీణ మధ్య తరగతి వర్గాలు రెండూ గణనీయమైన భాగంగా ఉన్నాయి. ఈ విభాగంలో తెల్ల చొక్కా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వృత్తిదారులు, మేధావులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. సరళీకరణ విధానాల ప్రభావంతో మధ్య తరగతి వర్గాల్లో పెద్ద తేడాలు నెలకొన్నాయి. బూర్జువా – భూస్వామ్య వ్యవస్థలో పై పొరల్లోని కొద్ది మంది మాత్రమే లబ్ధి పొందుతున్నారు. కానీ వారిలో అత్యధికులు, ఆ వ్యవస్థ కల్పించిన తీవ్ర సమస్యల వల్ల ఇబ్బంది పడుతున్నారు. ఈ సెక్షన్‌లను జనతా ప్రజాతంత్ర సంఘటన వైపు మళ్లించేందుకు ప్రత్యేక కృషి చేసి తీరాలి. ఈ సెక్షన్‌లను తరలించటంలో అభివృద్ధికర మేధావుల పాత్ర ముఖ్యమైనది.

బూర్జువా వర్గంలో కూడా బడా బూర్జువాలు, బడాయేతర బూర్జువాల మధ్య తారతమ్యాలున్నాయి. బడాయేతర బూర్జువాలు, బడా బూర్జువాల ఆధిపత్య ధోరణులతోను, పెరుగుతున్న సరళీకరణ విధానాలవల్ల బాధలకు గురౌతున్నారు. వారికి, విదేశీ పెట్టుబడికి మధ్య వైరుధ్యం తీవ్రతరమౌతుంది. కానీ వారిలోని కొన్ని తరగతులు విదేశీ పెట్టుబడితో మిలాఖత్ అవుతున్నాయి. కానీ బడాయేతర బూర్జువాల్లోని అత్యధికులు, ప్రధానంగా చిన్న, మధ్య తరగతి అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నారు. తమ ద్వంధ్వ వైఖరుల మూలంగా ఈ వర్గం విప్లవంలో ఒక అస్థిరమైన భాగస్వామి కావటమనేది కూడా అనేక నిర్ధిష్ట పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. కార్మిక వర్గం, వారి సమస్యలను చేపట్టడం ద్వారా ఆ తరగతిని ప్రజాతంత్ర సంఘటనవైపు ఆకర్షించేందుకు కృషి చేయాలి.

ఇటీవలి కాలంలో, రియాక్షనరీ, విప్లవ ప్రతీఘాత శక్తులు తమ ప్రభావాన్ని పెంచుకున్నాయి. తన వినాశకర విధానాల కారణంగా కాంగ్రెస్ పార్టీ ప్రజా మద్దతు కోల్పోయి పతనమైంది. ఆ శూన్యాన్ని బిజెపి, ఇతర అరాచక శక్తులు పూరించేందుకు పూనుకున్నాయి. ఫాసిస్టు ఆర్‌యస్‌యస్ బిజెపికి మార్గదర్శి, దాన్ని ఆధిపత్యం చలాయిస్తున్నది. అందుకే బిజెపి ఒక సాధారణ బూర్జువా పార్టీ కాదు. అది రాజకీయ వ్యవస్థ లౌకిక పునాదికి, వామపక్ష ప్రజాతంత్ర ఉద్యమానికి తీవ్రమైన ప్రమాదకరంగా తయారైంది. గణనీయమైన సెక్షన్‌ల బూర్జువాలు, భూస్వాములతో పాటు, సామ్రాజ్యవాదం కూడా బిజెపికి సంపూర్ణ సహకారాన్ని అందిస్తున్నది.

సమగ్రమైన పద్ధతిలో వ్యవసాయ విప్లవాన్ని సాధించాలి. బేషరతుగా ప్రవేశిస్తున్న విదేశీ పెట్టుబడిని వ్యతిరేకించాలి. భారత ఆర్థిక వ్యవస్థను, సామాజిక జీవితాన్ని, సంస్కృతిని మౌళికంగా పునర్నిర్మించే మార్గంలో ఎదురయ్యే ఆటంకాలను తొలగించేందుకు పూనుకోవాలి. అందుకు కమ్యూనిస్టుపార్టీ, పెట్టుబడిదారీ పూర్వ సమాజపు అవశేషాలను తుడిచిపెట్టడంపట్ల ఆసక్తిగల దేశభక్తియుత శక్తులన్నింటినీ ఐక్యం చేయాలి. జనతా ప్రజాతంత్ర విప్లవ సాధనకు జరిగే పోరాటం సంక్లిష్టమైనది, సుదీర్ఘమైనది. ఆ పోరాటం విభిన్న పరిస్థితులు, పలు దశల్లోనూ సాగించాలి. ప్రజా ఉద్యమాలను అభివృద్ధిచేయగల, సరైన ఐక్య సంఘటన ఎత్తుగడలను వినియోగించగల కమ్యూనిస్టు పార్టీ మాత్రమే తన వ్యూహాత్మక లక్ష్యాలను సాధంచగల్గుతుంది.

పార్టీ, మారుతున్న పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవసరమైన మధ్యంతర నినాదాలను రూపొందించాలి. వర్తమాన పాలకవర్గాలను గద్దె దించి, ఒక నూతన ప్రజాస్వామిక రాజ్యాన్ని, ప్రభుత్వాన్ని స్థాపించాలి. అందుకు అనుగుణమైన, స్పష్టమైన పథకాన్ని ప్రజల ముందుంచాలి. దానితోపాటు, ప్రజలకు తక్షణం ఉపశమనం కల్గించగల కార్యక్రమాన్ని, ప్రత్యామ్నాయ విధానాలను అమలుపరచగల ప్రభుత్వ స్థాపనకున్న అవకాశాలను వినియోగించుకోవాలి. పార్టీ, వర్తమాన బూర్జువా –భూస్వామ్య రాజ్యాన్ని, ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలను చైతన్యవంతులను చేయాలి. సమీకరించాలి. నిర్ధిష్ట పరిస్థితులను బట్టి రాష్ట్రాల్లో కానీ కేంద్రంలో గానీ ప్రభుత్వాలను ఏర్పరచేందుకున్న అవకాశాలను వినియోగించుకోవడం ద్వారా ప్రజా ఉద్యమాలను శక్తివంతం చేయాలి. రాష్ట్రాలు లేదా కేంద్ర ప్రభుత్వాల్లో చేరటమన్నది ఒక ఎత్తుగడల సమస్య. పార్టీ కార్యక్రమం ఒక సాధారణ దిశానిర్దేశాన్ని మాత్రమే చూపగలదు. కేంద్ర కమిటీ ఆ నిర్ధిష్ట పరిస్థితులకు అనుగుణమైన నిర్ణయాలు చేస్తుంది.

సిపిఐ(యం), జనతా ప్రజాతంత్రాన్ని, సోషలిస్టు పరివర్తనలను శాంతియుత పద్ధతుల్లో పూర్తిచేయాలని కోరుతున్నది. శక్తివంతమైన ప్రజా ఉద్యమాలను అభివృద్ధి చేయటం, పార్లమెంటరీ – పార్లమెంటరీ యేతర పోరాట రూపాలను సమ్మిళితం చేయటం ద్వారా మౌళిక పరివర్తనను సాధించేందుకు కార్మిక వర్గం దాని వర్గ మిత్రులు శాయశక్తులా కృషి చేస్తారు. అయితే పాలక వర్గాలు ఐచ్ఛికంగా తమ అధికారాన్ని వదులుకోవని నిరంతరం మన మనసులో ఉంచుకోవటం అవసరం. ప్రజల అభిప్రాయాన్ని వమ్ముచేసేందుకు, హింసాకాండల ద్వారా దాన్ని వెనక్కు కొట్టేందుకు అవి ప్రయత్నిస్తాయి. అందుకే విప్లవకర శక్తులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఏ విధమైన అవాంతరాలనైనా ఎదుర్కొనేందుకు వీలుగా తమ కృషిని

నిర్ధేశించుకోవాలి.

## 8 కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం

కార్మిక వర్గ అగ్రగామి దళంగా పనిచేయగల కమ్యూనిస్టు పార్టీ మాత్రమే, బలమైన కార్మిక కర్షక – ఐక్యత పునాదిపైన గుత్త పెట్టుబడిదారీ విధానానికి, భూసామ్య విధానానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకమైన సమరశీల పోరాటాలకు నాయకత్వంవహించగలదు. అందుకే, బలమైన అఖిల భారత కమ్యూనిస్టు పార్టీని నిర్మించాల్సిన అవసరాలు ఇలా ఉన్నాయి :

అ. కమ్యూనిస్టు పార్టీ మార్క్సిజం – లెనినిజంకు కట్టుబడి ఉండాలి. దాన్ని భారత పరిస్థితులకు అనుగుణంగా వర్తింపచేయాలి.

ఆ. ఆర్థిక, రాజకీయ, సైద్ధాంతిక, సామాజిక, సాంస్కృతిక రంగాలన్నింటా పార్టీ దీర్ఘకాల పోరాటాలను చేపట్టాలి. ప్రపంచ నూతన పరిస్థితుల్లో, సామ్రాజ్యవాదుల దాడులను తిప్పికొట్టాలి. ప్రజలను చీలగొట్టి, వారి ప్రజాతంత్ర చైతన్యాన్ని మొద్దుబార్చే మత మౌఢ్యము, మతోన్మాదము, కులతత్వాలను వెనక్కుకొట్టాలి.

ఇ. కమ్యూనిస్టు పార్టీ కేంద్రీకృత ప్రజాస్వామిక సూత్రాలపై ఆధారపడి పనిచేస్తుంది. ఒక ప్రజా విప్లవ పార్టీ ఉక్కు క్రమశిక్షణను పాటించాలి. నూతన ప్రజా ఉద్యమాలను పెంపొందించటం ద్వారా, నిరంతరం తన ప్రజా పునాదిని విస్తరించాలి. పార్టీ తనకు తాను ఎప్పటికప్పుడు మరలా మరలా విజ్ఞానవంతమౌతుండాలి. తన భావజాల సైద్ధాంతిక స్థాయిని పునరుద్ధరించుకోవాలి. తన నిర్మాణ బలాన్ని పెంచుకోవాలి.

ఈ. కమ్యూనిస్టు పార్టీ, అన్ని రకాల సామ్రాజ్యవాద వ్యతిరేక, దేశభక్తియుత, ప్రజాతంత్ర, లౌకక శక్తులను ఐక్యం చేస్తుంది. అత్యుత్తమ ప్రగతిశీలురు; చురుకైన, నిస్వార్థపరులైన స్త్రీ, పురుషులతో కూడిన భారత శ్రామిక ప్రజలను, తన శ్రేణుల్లో కలుపుకుంటుంది. మన ప్రజల పోరాట సాంప్రదాయాలను, ఉన్నత విలువలుగల మన సంస్కృతిని, నాగరికతలను ముందుకు తీసుకెళుతుంది. అదే సమయంలో దేశభక్తిని, శ్రామికవర్గపు అంతర్జాతీయతతో జతచేస్తుంది. ప్రపంచంలోని కమ్యూనిస్టు పార్టీలన్నింటి మధ్య ఆచరణాత్మక ఐక్యతకు కృషి చేస్తుంది.

నూతన భారత దేశం కోసం, ఒక జనతా ప్రజాస్వామిక భారత దేశం కోసం పోరాటం సాగుతున్నది. వర్గ దోపిడిని అంతం చేసేందుకు, సామాజిక విముక్తిని సాధించేందుకు, దేశపు సంపూర్ణ పురోగమనానికై సాగుతున్న ఈ పోరాటంలో దేశ ప్రజలందరూ చేరాలని అంతిమంగా కార్యక్రమం కోరుతున్నది.

## పార్టీ కార్యక్రమంపై కొన్ని రిఫరెన్స్ పుస్తకాల జాబితా :


1. సిపిఐ(యం) కార్యక్రమం, 2000, సిపిఐ(యం) కేంద్ర కమిటి, 2000.
2. 'కాంట్రిబ్యూషన్ టు ది డిస్కషన్ ఆన్ అప్‌డేటెడ్ పార్టీ ప్రోగ్రాం', సిపిఐ(యం) కేంద్ర కమిటి, 2000.
3. 'ఆన్ పార్టీ ప్రోగ్రాం', సిపిఐ(యం) కేంద్ర కమిటి, న్యూ ఢిల్లీ 2003
4. 'ఫైట్ ఎగనెస్ట్ రివిజనిజం', పార్టీ 7వ మహాసభ రాజకీయ నిర్మాణ నివేదిక, 1964. నేషనల్ బుక్ ఏజన్సీ కలకత్తా., 2000.
5. బిటి రణదివే – 'టు ప్రోగ్రామ్స్ : మార్క్సిస్టు అండ్ రివిజనిస్టు' – నేషనల్ బుక్ ఏజన్సీ కలకత్తా, 2000.
6. ఇయంయస్ నంబూద్రీపాద్ – 'ది ప్రోగ్రామ్ ఎక్స్‌ప్లైన్డ్' – నేషనల్ బుక్ ఏజన్సీ, కలకత్తా, 2000.
7. హరికిషన్ సింగ్ సూర్జిత్, 'సిపిఐ(యం) – సిపిఐ డిఫరెన్సెస్' – నేషనల్ బుక్ సెంటర్, న్యూ ఢిల్లీ, 1985.
8. యం. బసవపున్నయ్య–'ఆన్ ది ప్రోగ్రామ్ ఆఫ్ సిపిఐ(యం)' – సిపిఐ(యం) కేంద్ర కమిటి, 1985.
9. 'ది ఐడిలాజికల్ డిబేట్ సమ్మండ్ అప్' – బార్ద్వాన్ ప్లీనం , సిపిఐ(యం) కేంద్ర కమిటి, 1968.


*****

ప్రతులు : 1000
ప్రచురణ కాలం : జూన్, 2023
వెల : ₹. 15/-

ప్రచురణ

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటీ
27-13-3, గవర్నర్‌పేట, విజయవాడ - 2,
ఫోన్ నెం. 0866 2577202, 9490098000